
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 4 ఫిబ్రవరి 2025





దోపిడీకి.. ఏఐ వేట

నిన్నటి వరకు సీబీఐ, లేక ఢిల్లీ పోలీస్‌లమని బెదిరింపు కాల్స్ చేయటం, రిజర్వ్ బ్యాంక్ నుంచి, టెలికమ్ సర్వీసు సంస్థల నుంచి ఫోన్ చేసి సిమ్ బ్లాక్ చేస్తామని, ఖాతాలు స్తంభింపచేస్తామంటూ కాల్స్, మెసేజ్‌లు చేసిన పరిస్థితి ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ జనాన్ని అప్రమత్తం చేసేందుకు ఏకంగా అందరి సెల్ ఫోన్‌లో కాల్ చేసేప్పుడు ఒక కాలర్ టోన్ కింద ఈ మోసాలకు సంబంధించి జాగ్రత్తలు వివరిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు వీటిని కూడా దాటి సరికొత్త మోసాలకు సైబర్ కేటుగాళ్లు సిద్ధమై పోతున్నారు. మన ఫోన్ నుంచి ఏ తరహా ఆర్థిక లావాదేవీ చేసినా, చేసేముందు అప్రమత్తతతో ఉండాలనేది నిపుణుల మాట.

సైబర్ మోసాలపై ప్రభుత్వం ఎంత అవగాహన కల్పించినా... ఒకసారి మోసపోయాం కదా! మరోసారి జాగ్రత్త పడదామని అంతకు మించిన అప్రమత్తతో ఉన్నా, సాంకేతికను ఉపయోగించుకుని సైబర్ బూచోళ్లు జనం ఖాతాల్లోని డబ్బును దోచేస్తూనే ఉన్నారు. నిన్నటి వరకు మెసేజ్‌లు, బెదిరింపు కాల్స్ రూపంలో దోచుకున్న సైబర్ దొంగల బండారం అందరికీ తెలిసిపోవటంతో, ఆ తరహా మోసాల స్థానంలో కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) సాయంతో నయా మోసాలకు బరి తెగిస్తున్నారు. దీంతో సాంకేతికత తెలిసిన వారు, గత అనుభవాలున్న వారూ ఈ ఏఐ తరహా దోపిడీ వలలో చిక్కుకు పోతున్నారు. రూ. వేలల్లోనే దోపిడీ జరుగుతుండటంతో మోసపోయినవాళ్లు చాలా వరకు మన గ్రహ పాటని మిన్నకుంటుంటే, మరి కొందరు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.



డబ్బు దోచేసేందుకు పంపిన మెసేజ్‌లు


- సాంకేతికతను ఉపయోగించి మరిన్ని కొత్త దారుల్లోనూ..
- అమాయకులను మోసం చేసి దోచేస్తున్న సైబర్ బూచోళ్లు
- గ్రహించేలోపే ఖాతాల్లో డబ్బు మాయం
- రోజుకొక కొత్త మోసంతో జనం భయం భయం

తెనాలి, ఫిబ్రవరి 03, (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఓ వ్యాపారి కుటుంబంలో పెద్దకుమారుడు సురేష్ ఢిల్లీలో గ్రూప్స్ రాసేందుకు కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్నాడు. నా ఫోన్ పోయిందని, డబ్బంతా ఎకౌంట్‌లోనే ఉండటం, యూపీఐ యాప్‌లు ఫోన్‌లో ఉండటంతో ఇబ్బందిగా ఉందని, కొత్త ఫోన్ కొనుక్కునేందుకు రూ. 40 వేలు పంపాలంటూ తండ్రికి ఒక ఫోన్ వచ్చింది. మిత్రుని ఫోన్ నుంచి వాట్సప్ కాల్ చేస్తున్నానని చెప్పి తమ కుమారుడే వీడియో కాల్‌లో మాట్లాడటంతో ఆ తండ్రి ఖంగుతిన్నాడు. తీరా అసలు విషయమేమంటే... ఫోన్ పోయిందని, డబ్బులు పంపాలంటూ వీడియో కాల్‌తో మాట్లాడిన కుమారుడు ఆ సమయంలో ఆయన పక్కన ఉండటమే. వారం క్రితమే ఓ స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఎక్కడెక్కడో ఉన్న ఆయన కుటుంబ సభ్యులంతా ఇంటికి వచ్చారు. కుమారుడు పక్కనే ఉండగా మరో నంబర్ నుంచి అచ్చం తన కుమారుడే మాట్లాడుతున్నట్లు వీడియో కాల్ రావటంతో అప్రమత్తమైన ఆ తండ్రి వెంటనే సమాచారాన్ని 1930 నంబర్‌కు అందించారు. ఆ తర్వాత వారికి ఏఐ సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు ఫేక్ వీడియో కాల్‌తో వల విసిరారనే విషయం తెలిసింది. అదే సమయంలో కుమారుడు ఇంటిలో లేకుంటే ఆ తండ్రి డబ్బు పంపి మోసపోయేవారే. ఇదే తరహాలో గడచిన పది రోజుల నుంచి ఏఐ యాప్‌ల ద్వారా ఫేక్ వీడియోలు తయారుచేసి ఫోన్ చేస్తుండటం ఒక సంచలనమైతే, అసలు తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌లు, వారి సంబంధాలు మోసగాళ్లకు ఎలా తెలుస్తున్నాయనేది అంతుబట్టని ప్రశ్న. ఫోన్ చేసే వ్యక్తి ఎక్కడ ఉంటున్నారనేది కానీ, ఏం చేస్తున్నారనే ది కానీ కాల్ మాట్లాడేటప్పుడు ప్రస్తావనకు రావటం లేదని, అయితే కుమారుడా? కుమార్తె, లేక ఇతర బంధుత్వాలా అనేది వరసలు మాత్రం కచ్చితంగా చెబుతున్నారనేది బాధితులు చెబుతున్న మాటలతో అర్థమవుతోంది. ఒకరిద్దరికి మాత్రం సంబంధం లేని వరసలు కలిపి మాట్లాడటంతో వారు తమ కుమారుడు కాదని, అల్లుడని చెప్పటం, తర్వాత వారికి వచ్చింది ఫేక్ కాల్ అని తెలుసుకుని అప్రమత్తమయిన పరిస్థితి ఉందంటే, పెద్ద ఫోన్‌లు వాడే వారిలో సాంకేతికత గురించి పెద్దగా తెలియని వారికి కనుక ఫోన్ వస్తే వారు మోసపోయినట్టే.

చిన్న మొత్తంలో డబ్బు ఎరవేసి.. పెద్ద మొత్తం కొట్టేసి..

మన ఖాతాకు డబ్బు జమ అయినట్టు మెసేజ్ వస్తే మనకు ముందుగా గుర్తొచ్చేది ఫోన్‌పే, గూగుల్‌పే కానీ, యూపీఐ యాప్‌లే. వాటిని ఓపెన్ చేసి బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలనే ఆలోచన చేస్తారెవరైనా. ఈ అలవాటును దోపిడీకి బలహీనతగా ఉపయోగించుకుని మరికొందరు వల విసురుతున్నారు. ముందుగా మన ఖాతాకు రూ. 200 కానీ, రూ. 2వేలు కానీ, పంపటం, లేక పంపినట్టు ఒక మెసేజ్ పంపటం వీరు చేసే మోసంలో తొలి ప్రయత్నం. డబ్బు రాగానే ఫోన్‌పే ద్వారా బ్యాలెన్స్ చెక్ చేసుకోటానికి ప్రయత్నించే లోపే యూపీఐ యాప్‌లకు మనమే డబ్బు పంపటానికి ఒక రిక్వెస్ట్ మోసగాళ్ల నుంచి రావటం, యాధృచ్ఛికంగా దానిని ఓపెన్‌చేసి, బ్యాలెన్స్ చూస్తున్నామన్న ఆలోచనతో కానీ, తొందరపాటుతోకానీ మన యూపీఐ యాప్ పాస్వర్డ్‌ను ఎంటర్ చేస్తే మన ఖాతాకు డబ్బు రావటం అటుంచి, మన ఖాతాలోని డబ్బు మాయమవటం ఈ మోసం ప్రత్యేకత.

అయితే మన ఖాతాకు ఏదైనా నగదు జమ అయినా వెంటనే యూపీఐ యాప్‌లలో చూడటం కాకుండా, సంబంధిత బ్యాంక్ ఫోన్ యాప్‌ల ద్వారా చెక్ చేసుకుంటే సురక్షితంగా ఉంటుందని, లేక ఏదైనా మెసేజ్ వచ్చిన వెంటనే కాకుండా కొంత సమయం వేచి ఉంటే, సైబర్ మోసగాళ్ల మరో ఖాతా పనిలో ఉండటం వల్ల మనకు వెంటనే రిక్వెస్ట్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని, ఇటువంటి జాగ్రత్తలతో వారి పే రిక్వెస్ట్‌ల మోసాల నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్న మాట. ఇది కాక... అనేక రూపాల్లో కొత్త తరహా మోసాలకు సైబర్ బూచోళ్లు తెగబడుతూనే ఉన్నారు. మన ప్రాంతాల్లో జరగకున్నా, రాష్ట్రంలో పలుచోట్ల మోసాలు జరుగుతున్నాయంటూ కాల్ పార్వర్డ్ తరహాలో జరుగుతున్న దోపిడీపైనా వీడియోలు వైరల్ అవుతున్నాయి. అపరిచితులు తమ ఫోన్ చార్జింగ్ అయిపోయిందని, లేక బ్యాలెన్స్ లేదని, ఒక ఫోన్ చేసుకుని ఇస్తానని అడిగి మన ఫోన్ తీసుకుని దానిలో 'స్టార్ 401 హ్యాష్' తర్వాత వారి ఫోన్ నంబర్ టైప్‌చేసి మన ఫోన్‌లో కాల్ కొడితే మన ఫోన్‌కు వచ్చే కాల్స్, ఓటీపీలు, పాస్వర్డ్‌లు వారి నంబర్‌కు ఫార్వర్డ్ అవుతాయని, దీనిద్వారా మన ఖాతాలో డబ్బు సునాయాసంగా వారు దోచేసే అవకాశం ఉందంటూ ఒక పోలీస్ అధికారి డ్రెస్‌లో వ్యక్తి చైతన్యం కలిగించేలా ఒక వీడియో వైరల్ అవుతోంది.



ఏఐ సాయంతో ఫేక్ కాల్ కోసం వీడియో తయారు చేసేందుకు అందుబాటులో ఉన్న యాప్

తెనాలిలో ఓ ప్రముఖ ప్రయివేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న పేరుచెప్పటానికి ఇష్టపడని ఒక ఉద్యోగికి తాజాగా ఇదే పరిస్థితి ఎదురయింది. ఈయన ఖాతాకు రూ. 2,000 జమ అయినట్టు మెసేజ్ రావటంతో వెంటనే తన ఫోన్‌పే యాప్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకునే ప్రయత్నం చేయటం, వెంటనే దానికి రూ. 20,000 ఆయనే పే చెయ్యటానికి వీలుగా మోసగాళ్ల నుంచి పేమెంట్ రిక్వెస్ట్ రావటంతో ఆయన దానిపై క్లిక్ చేసి పాస్వర్డ్ కొట్టేయటంతో రూ. 20వేలు ఖాతా నుంచి వెళ్లిపోయాయి. తర్వాత బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే రూ. 2వేలు తన ఖాతాలోకి జమ కావటం అటుంచితే, తన ఖాతాలోనే ఉండాల్సిన నగదు నిల్వలోని రూ. 20వేలు వెళ్లిపోవటం కలవరపాటుకు గురిచేసిన పరిస్థితి. యాప్‌లోనే చెల్లింపుల వివరాలు చూస్తే తన డబ్బు పోయిన ఖాతా నంబర్ చివరి అంకెలు కనిపించటంతో అప్రమత్తమయ్యారు. బ్యాంక్ ఉద్యోగి కావటంతో వెంటనే తన ఖాతా నుంచి ఫేక్ ఎకౌంట్‌కు డబ్బు పంపినట్టు, తాను మోసపోయినట్టు తన ఖాతా ఉన్న బ్యాంక్ నంబర్‌లకు, మెయిల్స్‌కు ఆ మొత్తం పెండింగ్‌లో పెట్టేలా రిక్వెస్ట్ పంపటం, తర్వాత చేయాల్సిన రికవరీ పనులు బ్యాంకుకు వెళ్లి ప్రయత్నించటంతో రెండు వారాల తర్వాత ఆయన డబ్బు తిరిగి సొంత ఖాతాకు జమ అవటంతో ఊపిరి పీల్చుకున్నారు. అదే బ్యాంకు ఉద్యోగులు, అవగాహన ఉన్న వారు కాకుండా ఇతరులైతే ఆ డబ్బు పోయినట్టే.

కొండకెళ్లేదెలా?



చిలకలూరిపేట మేజర్ బ్రిడ్జి సమీపంలో అక్రమ మట్టి తవ్వకాలు



అవిశాయ పాలెం రహదారి దుస్థితి

- అధ్వానంగా కోటప్పకొండ రహదారులు
- సమీపిస్తున్న త్రికోటేశ్వరుడి తిరునాళ్ళ

(కోటప్పకొండ(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ రహదారులు అధ్వానంగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా 26న తిరునాళ్ల జరగనున్నాయి. తిరునాళ్ల సమీపిస్తున్నా రహదారులకు మరమ్మతులు చేపట్టలేదు. కోటప్పకొండ నుంచి అవిశాయపాలెం వరకు ఉన్న రహదారి పునరుద్ధరణ నిమిత్తం తవ్వేశారు. అయితే పనులు నత్తనడకన సాగడంతో తిరునాళ్ల నాటికి పనులు పూర్తయ్యేనా అనే అనుమానాలు భక్తులు వ్యక్తపరుస్తున్నారు. తిరునాళ్ళకు వచ్చే వాహనాలు మళ్ళింపునకు ఇదే కీలక రహదారి కాబట్టి నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయకుంటే యాత్రికులు ఇక్కట్లు పడాల్సి వస్తుంది.

తిరునాళ్ల ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా చిలకలూరిపేట మేజర్ కాలువ కట్టపై తారు రోడ్డు నిర్మించారు. రూ 90 లక్షలతో నిర్మించిన బీటీ రహదారి పూర్తిగా దెబ్బ తింది. కాలువ పక్కనే పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఓవర్ లోడ్‌తో మట్టి లారీలు ఈ రహదారిపై వెళుతుండటంతో ఇది పూర్తిగా ధ్వంసమై పెద్ద ఎత్తున గోతులు ఏర్పడ్డాయి. యలమందల రోడ్డులో ప్రభలు వచ్చే సమయంతో కాలువ కట్ట రహదారి నుంచి వాహనాలను మళ్లిస్తారు. అప్పటికి రోడ్డు ఇలానే ఉంటే ఇబ్బందే.

మరమ్మతులకు నోచుకోని ఘాట్ రోడ్డు

ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. భారీ వర్షాలతో వరద నీరు ప్రవహించడంతో రోడ్డు మార్జిన్లు కోతకు గురయ్యాయి. దీంతో రోడ్డు మార్జిన్ దిగాలంటే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మార్జిన్‌లను పటిష్ట పరచాల్సి ఉంది.



కోతకు గురైన ఘాట్ రోడ్డు మార్జిన్

నాసిరకంగా నిర్మాణ పనులు



కాంక్రీట్ పనులకు వినియోగిస్తున్న వాగు ఇసుక


కోటప్పకొండ దేవాలయ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అన్న దాన మండపం దిగువున గోడ నిర్మాణం చేస్తున్నారు. ఈ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. గోడ కాంక్రీట్ పనులకు వాగు ఇసుకను వినియోగిస్తున్నారు. నది ఇసుక వినియోగించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా పనులు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఈవో చంద్రశేఖర రావును వివరణ అడగ్గా పనులు ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలిస్తున్నారని, వాగు ఇసుక వినియోగంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కోటప్పకొండను.. కొల్లగొడుతున్నారు..

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా కొత్తగా ఏర్పడడంతో అక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్లు పెద్ద ఎత్తున వేస్తున్నారు. ఇదే మైనింగ్ మాఫియాకు కలిసొచ్చింది. రియల్ వెంచర్లలో రోడ్లు వేయడానికి ఇతరత్రా అవసరాలకు గ్రావెల్ అవసరం ఎక్కువ, అదీ కొండ గ్రావెల్ అయితే మంచి రేటు పలుకుతోంది. ఇంకేముంది నరసరావుపేటలోని గ్రావెల్ మాఫియా కన్ను కోటప్పకొండ ప్రాంతం మీద పడింది. కోటప్పకొండను కొల్లగొట్టి, మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. మరి అధికారుల ఏమి చేస్తున్నారని మీకు అను మానం రావచ్చు. మైనింగ్ చేసేది ముఖ్య నేత బంధువు కావడంతో వారు మిన్నకుంటున్నారు. అంతేకాదు నరసరావుపేటలో గ్రావెల్ దందా అంతా ముఖ్య నేత బంధువుకు అప్పగించినట్లు సమాచారం. దీంతో మైనింగ్ శాఖ, విజిలెన్స్ శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. ఇక్కడ జరుగుతున్న దందాపై వివరణ అడిగేందుకు ప్రయత్నించగా సంబంధిత జిల్లా అధికారి స్పందించలేదు.



కొండపై మట్టి తవ్విన ప్రాంతం

రెండు గృహాల్లో చోరీ

- 25 సవర్ల బంగారం, 2.20 లక్షల నగదు అపహరణ

క్రోసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికపాడు, దొడ్లేరు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం దొంగలు రెండు గృహాల్లో చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.22 లక్షల సొత్తు చోరీకి గురైనట్టు బాధితులు తెలిపారు. ఆయా గృహాల వారు తాళాలు వేసి పొలం పనులకు వెళ్లగా మధ్యాహ్నం ఈ చోరీలు జరిగాయి. రెండు గృహాలకు వేసి ఉన్న తాళాలను పగల గొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. దొడ్లేరుకు చెందిన చిన అంజిరెడ్డి గృహంలో 15 సవర్ల బంగారం, రూ.20 వేలు నగదు దొంగలు చోరీ చేశారు.



పగలగొట్టిన బీరువా

పెరికపాడులో..

పెరికపాడులోని బాణావత్ రామకోటి నాయక్ గృహంలో బీరువాలో ఉన్న రెండు లక్ష ల నగదు, 10 సవర్ల బంగారం చోరీకి గురై నట్టు బాధితులు తెలిపారు. 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన బాధితులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమా చారం ఇచ్చారు. సీఐ పత్తిపాటి సురేష్, ఎస్ఐ నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీ లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అనంతవరంలో వారం రోజు ల క్రితం రెండు గృహాల్లో నగదు, బంగారం చో రీకి గురైంది. నెల క్రితం ఎర్రబాలెంలో ఒంటరి గా ఇంట్లో ఉన్న వృద్ధురాలిని బెదిరించి దొంగలు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. నూజెండ్ల బీసీ కాలనీకి చెందిన ఏడుకొండలు ఇంట్లో దొంగలు బీరువా పగలగొట్టి బంగారం, వెండి, నగదు కలిపి సుమారు రూ 5 లక్షలు సొత్తును దొంగిలించారు.

పరీక్షా పత్రం సకాలంలో అందక విద్యార్థుల ఆందోళన 6
- యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అవస్థలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు... నోటిఫికేషన్ విడుదల

- తొలి రోజున ఒక నామినేషన్ దాఖలు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి నోటిఫికేషన్‌ని అధికారికంగా విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకార ప్రక్రియని ప్రారంభించారు. తొలి రోజున పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన కనకం శ్రీనివాసరావు తన నామినేషన్‌ను ఆర్వో నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్వో నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సమయంలో నామినేషన్లు దాఖలు చేయవచ్చ న్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం, వెలుపల పటిష్ట పోలీసు బందోబస్తుని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

అనుబంధ పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదించిన అనుబంధ పోలింగ్ స్టేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి ఖరారు చేస్తే జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపడం జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో ఆమె తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కె శ్రీనివాసరావుతో కలసి పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో వెయ్యి ఓట్లకు పైన ఉన్న పోలింగ్ స్టేషన్లకు అదనంగా వేరొక పోలింగ్ కేంద్రాన్ని అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు 39 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో చర్చించి 8 అనుబంధ పోలింగ్ కేంద్రాలను తగ్గించడం జరిగిందన్నారు. దీని ప్రకారం జిల్లాలో 149(118+31) పోలింగ్ స్టేషన్ల జాబితాను సీఈవోకు పంపించడానికి ఏఆర్‌ఓలు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మిగిలిన ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు జిల్లాలో అనుబంధ పోలింగ్ కేంద్రాల వివరాలు అందిన తర్వాత మొత్తం పోలింగ్ కేంద్రాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. అలానే సోమవారం వరకు నమోదు అయిన ఓటర్లలో పురుషులు 2,06,225 మంది, మహిళలు 1,40,344 మంది, ట్రాన్స్ జెండర్స్ 45 మంది మొత్తం 3,46,614 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు.



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పరీక్షా పత్రం అందక విద్యార్థుల ఆందోళన

- కొద్ది నిమిషాల ముందు బీఈడీ మోడల్ పేపర్ పంపి జిరాక్స్ తీసుకోమన్న నిర్వాహకులు
- కొన్ని కేంద్రాల్లో మిషన్‌లు చెడిపోయి తీవ్ర జాప్యం
- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 29 కేంద్రాల్లో నిర్వహణ
- యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అవస్థలు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఈడీ పరీక్షల నిర్వహణలో నాగార్జున యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షా కాలాన్ని పూర్తిగా వినియోగించుకోలేక ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం నుంచి బీఈడీ రెగ్యులర్, సప్లిమెంటరీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని మొత్తం 29 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 8500 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అయితే రెండు, మూడు రోజులు ముందుగా సీల్డ్ బండిల్స్‌లో ఎంతో జాగ్రత్తగా పరీక్షా పేపర్లను ఆయా కేంద్రాలకు పంపుతారు. అందుకు భిన్నంగా సోమవారం పరీక్షా కేంద్రాలకు కేవలం 15 నిమిషాలు ముందుగా మోడల్‌గా ఒక పేపర్‌ను ఈ మెయిల్‌లో పంపి విద్యార్థులకు సరిపడా జిరాక్స్‌లు తీసుకోవాల్సిందిగా నాగార్జున యూనివర్సిటీ అధికారులు సూచించారు. ప్రింటింగ్ ఖర్చు తగ్గించుకునేందుకే యూనివర్సిటీ పరీక్షా కేంద్రం నిర్వాహకులు ఇలా పంపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నపత్రాన్ని సకాలంలో రూపొందించటంలో కూడా అధికారులు నిర్లక్ష్యం వహించటం మూలంగా కూడా అధికారులు ఇలా చేశారనే ఆగ్రహం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నది. దీని మూలంగా తమ కేంద్రానికి వచ్చిన పేపర్‌ను అప్పటికప్పుడు జిరాక్స్‌లు తీసి ఇవ్వటంలో ఆయా కేంద్ర నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రాల్లో జిరాక్స్ మిషన్‌లు మొరాయించటంతో జిరాక్స్ తీయించేందుకు బయట సెంటర్‌లకు పరుగులు తీయాల్సి వచ్చింది. దీంతో ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షలు చాలా కేంద్రాల్లో ఆలస్యంగా జరిగినట్లు సమాచారం. అయితే కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులు విద్యార్థులు కోల్పోయిన సమయాన్ని చివరలో ఇవ్వగా, కొన్ని కేంద్రాల్లో మాత్రం అనుమతివ్వకపోవటంతో విద్యార్థులు అరకొరగా పరీక్షలు రాయాల్సి వచ్చింది. కనీసం మంగళవారం నుంచి కొనసాగే పరీక్షలకైనా ప్రశ్నపత్రాన్ని ముందుగా పంపించి అటు పరీక్షా కేంద్రం నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవోగా డాక్టర్ కూరపాటి మేఘన



గుంటూరు (విద్య) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా డాక్టర్ కూరపాటి మేఘన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కూరపాటి మేఘన మాట్లాడుతూ యూనివర్సిటీ నియమ, నిబంధనలు, నైతిక విలువలు పాటిస్తూ వర్సిటీను మరింత ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తానన్నారు.

టీడీపీ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో శ్రీనివాస్‌నగర్‌లో 25 సంవత్సరాల క్రితమే ముప్పా సుబ్బారావు అనే వ్యక్తి 9.5 సెంట్ల స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయం కొరకు నారా చంద్రబాబు నాయుడు పేరు మీద ఎప్పుడో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అయితే నక్కా సత్తార్‌రెడ్డి అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్‌లతో ఆ స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ వేరే వ్యక్తికి చేశాడు. ఈ ఘటనపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వైసీపీకి సంబంధించిన చాలా మంది ఇటువంటి భూదందా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. చాలామంది భూములను, ఇళ్లను దొంగ రిజిస్ట్రేషన్‌లు చేయటమేకాకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌లను కూడా కట్టారని తెలిపారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినా కూడా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నకిలీ డాక్యుమెంట్‌లతో దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిపి బ్యాంక్‌లలో రుణాలు తీసుకునే పనిగా పెట్టుకొని బ్యాంకర్లను మోసం చేస్తున్నారన్నారు. భూదందాలో నష్టపోయిన వారు ఎవరైన సరే వారికి తప్పకుండా న్యాయం చేస్తామనీ, ఎమ్మెల్యేగా తోడుంటానని నరేంద్రవర్మ తెలిపారు.

ఉప్పే అని ఊరుకున్నారు!

- మూడు నెలలైనా పోలీసులకు ఫిర్యాదు చేయని అధికారులు
- ఆర్గానిక్ ఎరువుల పేరిట రైతులను మోసగించే యత్నం
- స్టార్ అగ్రి జెనిటిక్స్‌కు కలిసొచ్చిన వ్యవసాయ శాఖ అలసత్వం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పు భూమిని తాకితే అది నిస్సారమై చౌడునేలగా మారుతుంది. మొక్క మొలవదు, కాపు కాయదు. అంతటి ప్రమాదకరమైన పరిస్థితి. ఆర్గానిక్ ఎరువుల పేరుతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని రైతులను అటువంటి ప్రమాదంలో పడేసేందుకు ప్రయత్నం చేసింది. రైతుల నిరక్షరాస్యతను ఆధారంగా చేసుకుని ఆర్గానిక్ ఎరువుల పేరుతో ఉప్పును అంటకట్టింది. 2024 సెప్టెంబర్ 10న గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ఎల్ పార్శిల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పంపేందుకు సిద్ధంగా ఉన్న ఆర్గానిక్ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. అనుమానం వచ్చి సుమారు 13.68 లక్షల విలువ చేసే ఆరువేల కిలోల ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపటంతో అవి ఎరువులు కాదు.. ఉప్పని తేలింది. ల్యాబ్ నివేదికలో అన్ని నమూనాలు విఫలం కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది. నవంబరులోనే ఈ రిపోర్ట్ ల్యాబ్ నుంచి అధికారులకు అందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌పై కేసు నమోదు చేయిస్తామని అధికారులు అప్పట్లో వెల్లడించారు.

మూడు నెలలుగా....

ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్ యాజమాన్యం జైలుకు వెళ్తుందని అందరూ భావించారు. అయితే ఆ విషయంలో వ్యవసాయ శాఖ ఊహించని ట్విస్ట్ ఇచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ వచ్చి మూడు నెలలు అయినా సంస్థపై క్రిమినల్ కేసు నమోదు కాలేదు. కనీసం ఉత్తరప్రదేశ్‌లోనైనా అక్కడి అధికారులను అప్రమత్తం చేశారా అంటే అదీ లేదు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తరువాత ఒకరిద్దరు స్థానిక ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారన్న ప్రచారం బలంగా ఉంది. దీంతో వ్యవసాయ శాఖ మౌనంగా ఉండిపోయింది.

ఆలస్యమే అమృతం...

వ్యవసాయ శాఖకు చెందిన వ్యవహారంలో ఎంత ఆలస్యం అయితే నకిలీ ఎరువులు, పురుగు మందులు అమ్మే వ్యాపారులకు అంత మేలు జరుగుతుంది. తొలుత వ్యవసాయ శాఖ అధికారులు సేకరించి ల్యాబ్‌కు పంపిన నమూనాలు విఫలం అయితే ఆ వ్యవహారంలో వ్యాపారులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. కోర్టుకు వెళ్లి నమూనాలు మళ్లీ సేకరించాలని ఆదేశాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంతలో అధికారులు సీజ్ చేసి వేరే వ్యాపారి వద్ద ఉంచిన సరుకులో కూడా మార్పులు జరుగుతాయి. నకిలీ దాని స్థానంలో మంచి సరుకును ఏర్పాటు చేస్తారు. కోర్టు ఆదేశాలతో మళ్లీ నమూనాలు సేకరిస్తే మలి పరీక్షలో అది మంచిదనే రిపోర్టు వస్తుంది.

ఈ కేసులో కూడా...

ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌కు చెందిన ఉదంతంలో కూడా దరిదాపుగా అదే జరిగే అవకాశం కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్తత నకిలీ వ్యాపారులకు కలిసి వస్తుందని అందరూ అంటున్నారు. పక్కాగా పట్టుకుని, ల్యాబ్ రిపోర్ట్ వ్యతిరేకంగా వచ్చిన తరువాత కూడా క్రిమినల్ కేసు నమోదుకు అధికారులు మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు పత్రాలు రావాలి..

ఈ కేసుకు సంబంధించిన అసలు పత్రాలు జేసీ కోర్టులో ఉన్నందున క్రిమినల్ చర్యలు చేపట్టలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అక్కడ నుంచి అసలు పత్రాలు తీసుకున్న తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ లోపు ఆర్గానిక్ ఎరువుల పేరిట రైతులను మోసపుచ్చాలని చూసిన ఉత్తరప్రదేశ్ సంస్థ అన్నీ సర్దుకుంటే ఏమిటి పరిస్థితి అన్న ప్రశ్నకు వ్యవసాయ శాఖ వద్ద సమాధానం లేదు.

ఆలపాటి విజయానికి కృషి చేయాలి

- మంత్రి గొట్టిపాటి రవి కుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో నవయుగ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి సమన్వయ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ అలసత్వం లేకుండా ప్రతి ఓటరును రెండు నుంచి మూడు సార్లు కలిసి ఓటుకు తీసుకురావాలన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా పెన్షన్ ఇస్తున్నారని అన్నారు. అదేవిధంగా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారన్నారు. 7వ తేదీన ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ వేస్తారని చెప్పారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులను కలుపుకొని పనిచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు పెరిగాయన్నారు. ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో మోడీ సహకారంతో అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం ప్రయణిస్తుందన్నారు. అందరూ ఆశీస్సులు అందజేసి విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు

అరవిందబాబు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించటమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏలా అవమానించబడ్డారో తెలియజేయాలన్నారు. గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు చిలకలూరిపేట ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశి, రంగిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటిల రామచంద్రప్రసాద్, వెన్నా సాంబశివారెడ్డి, నరసరావుపేట పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ, పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి అభిమతం

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి ఓటేసిన వైసీపీలోని నిజాయితీ గల కార్పొరేటర్లు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోవడం ఇష్టం లేకపోయినా, అందులోని నిజాయితీపరుల ప్రవర్తనతో తీసుకున్నాం. వైసీపీలో కొందరు మూడు వంతెనల నిర్మాణానికి అడ్డు పడుతుండగా, ఇంకొందరు మాత్రం నగరాభివృద్ధిని బలంగా కాంక్షిస్తున్నారు. అందులో భాగంగానే వైసీపీలోని పలువురు నిజాయితీపరులైన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ చేస్తున్న అభివృద్ధికి ఓటు వేశారు' అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఢిల్లీలో ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకున్న అనంతరం పెమ్మసాని గుంటూరులోని స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలను స్థానిక అధికారులు, నాయకుల ద్వారా తెలుసుకున్నారు. స్టాండింగ్ కమిటీ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీతోపాటు కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ చేశారన్నారు. నగరాభివృద్ధిని కోరుకుంటూ, అభివృద్ధిలో తామూ భాగమవ్వాలని భావించే వైసీపీలోని కొందరు నిజాయితీపరులే స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు. చాలా కాలంగా వైసీపీ నుంచి పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, అందుకు టీడీపీ సిద్ధంగా లేదని చెప్పారు. ఎవరైతే మంచి వ్యక్తులు, ప్రజోపయోగ కార్యక్రమాలలో ముందుండే నాయకులు ఆ పార్టీలో ఉన్నారో, అటువంటి నాయకులనే పార్టీలోకి తీసుకున్నామని చెప్పారు.

సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

- ఏర్పాటుకు ఫైబర్ నెట్ సన్నాహాలు
- ఫలించనున్న సీసీఐ మాజీ మేనేజర్ ఆదిత్య పోరాటం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ అందుకు తగిన సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశాలతో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్‌ను ప్రాసెస్ చేయమని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి కార్యాలయం కూడా ధ్రువీకరించింది. సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మాజీ మేనేజర్ జి.సాయి ఆదిత్య పోరాటం చేస్తున్న విషయం విదితమే. గతేడాది మే నెలలోనే ఆయన ఈ విషయంలో రాష్ట్ర అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి నారా లోకేశ్ కార్యాలయంలో సమర్పించిన వినతి పత్రం గుంటూరు జిల్లా కలెక్టర్‌కు పంపారు. దానిపై స్పందించిన కలెక్టర్ ఆల్ ఎలిమిటీస్‌తో కూడిన సీసీ కెమెరాలను సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. సీజన్ ఆరంభం అయిన తరువాత గుంటూరు జిల్లాలో నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు ఆరంభించారు కానీ ప్రభుత్వం తరఫున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఆ విషయంలో సీసీఐ మాజీ మేనేజర్ సాయి ఆదిత్య హైకోర్టుకు వెళ్లగా గత డిసెంబర్ 16న సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఒక వారం వ్యవధిలో తీర్పును అమలు చేయాలని ఆదేశించింది.

సీఎం కు ఫిర్యాదు...


సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యం, హైకోర్టు తీర్పు అంశాలను సాయి ఆదిత్య సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో సీసీఐ సబ్-మార్కెట్ యార్డులుగా నోటిఫై చేసిన 60 జిన్నింగ్ మిల్లుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ అండ్ లైవ్‌స్టాక్ మార్కెట్స్ యాక్ట్ - 1966 అమలు కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఫిర్యాదు ఫైబర్ నెట్ చైర్మన్‌కు కూడా అందజేశారు. ఫిర్యాదును పరిశీలించిన జీవీ రెడ్డి కోర్టు తీర్పును వెంటనే అమలు పరిచే విధంగా ఫైల్ ప్రాసెస్ చేయాలని కార్యాలయంలోని అధికారులను ఆదేశించారు.

ఆల్ ఎలిమిటీస్ అంటే...

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై గతేడాది అక్టోబరులోనే ఒక అంచనాకు వచ్చింది. ఒక్కొక్క కేంద్రంలో సుమారు 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేశారు. అందుకోసం అవసరమైన నిధులను మార్కెటింగ్ శాఖ భరించాల్సి ఉంది. ఆల్ ఎలిమిటీస్ కలిగిన సీసీ కెమెరాల ఏర్పాటు వలన సీసీఐ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక రాష్ట్ర ఆర్టీజీస్ సెంటర్‌లో తెలిసిపోతుంది. ఒక మనిషి ఆ కేంద్రానికి ఎన్నిసార్లు వచ్చారు. కేంద్రానికి ఎంత మొత్తంలో పత్తి వచ్చింది. ఎన్ని వందల దూది బేళ్లు వచ్చాయి. వంటి కీలకమైన విషయాలను ఆల్ ఎలిమిటీస్ కలిగిన సీసీ కెమెరాలు స్పాట్‌లో విశ్లేషిస్తాయి.విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఈ కెమెరాలకు ఉంటుంది.

గుండెపోటుతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

యడ్లపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ దావల చిన్నమూర్తియ్య(40) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. సీఆర్పీఎఫ్ 2006 బ్యాచ్‌కు చెందిన మూర్తియ్య ఒడిశాలో పనిచేస్తూ ఇటీవల స్వగ్రామమైన సొలసకు వచ్చాడు. సోమవారం ఉదయం కాలకృత్యాలు పూర్తయిన తరువాత గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మూర్తియ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మూర్తియ్య బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



దావల చిన్నమూర్తియ్య(ఫైల్)

వైసీపీకి ఏమీ చేతకాలేదు

- రాజ్యసభలో వైసీపీ ఎంపీపై పెమ్మసాని విసుర్లు



రాజ్య సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నిజంగా అంత అద్భుతమైన పాలనే చేసి ఉంటే 175కి 11 స్థానాలు మాత్రమే ఎందుకు వచ్చాయి? రాష్ట్రంలో ఒక్క రోడ్డు వేయలేకపోయారు. ఒక్క కేంద్ర ప్రభుత్వం పథకం కూడా ఉపయోగించుకోవడం చేతకాలేదు' అంటూ గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజ్యసభ సాక్షిగా వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటి కాదని, వ్యవసాయం, రైతులకు లబ్ధి చేకూరేలా వైసీపీ 11 స్కీములు పెట్టిందని, కానీ టీడీపీ పట్టించుకోవడం లేదని అని పిల్లి సుభాష్ చంద్రబోస్ రాజ్యసభలో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలను మంత్రి పెమ్మసాని ఖండించారు. ఆంధ్రప్రదేశ్లో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తోందని, ఏడు నెలలకు ముందు వరకు రాష్ట్రంలో ఒక్క చిన్న రోడ్డు కూడా వైసీపీ ప్రభుత్వం వెయ్యలేకపోయిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఏ ఒక్క పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని పెమ్మసాని స్పష్టం చేశారు. పెమ్మసానిని పిల్లి సుభాష్ చంద్రబోస్ అడ్డుకునే ప్రయత్నం చేయబోగా ఆయన్ను కూర్చోవాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ పద్మావతి



మున్నంగి హైస్కూల్ రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ పద్మావతి

కొల్లిపర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ బత్తుల పద్మావతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని పిల్లల తల్లిదండ్రులను, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాలల హక్కులు క్షేత్రస్థాయిలో పరిరక్షించాలనీ, ఉల్లంఘనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ప్రధానోపాధ్యాయులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్, నంద్యాల ఎడ్లజతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 175వ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో సోమవారం సీనియర్స్ విభాగంలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, సాకేత్‌రెడ్డి, నంద్యాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డికి కంబైన్డ్ ఎడ్లజత 2400 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, మేకా కృష్ణమోహన్ (కృష్ణా జిల్లా) మక్కెన కోటేశ్వరరావు (ఉంగుటూరు, ప్రకాశం జిల్లా)లకు చెందిన కంబైన్డ్ ఎడ్లజత 2165.3 అడుగుల దూరం లాగి రేండో బహుమతి, పులగం త్రిషగ్నారెడి (కుంచనపల్లి, తాడేపల్లి)కి చెందిన ఎడ్లజత 2140 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల (వేటపాలెం, బాపట్ల జిల్లా)కు చెందిన ఎడ్లు 2100 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, కటకంట లక్ష్మణకుమార్ (దుర్గి, పల్నాడు జిల్లా) ఎడ్ల జత 1847 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని కైవసం చేసుకున్నాయి. 9 జతలకు వరుసగా బహుమతులివ్వగా, మరో మూడు జతలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. 6 రోజుల పాటు నిర్వహించిన పోటీలకు రెండు రాష్ట్రాల నుంచి 70 జతలు పోటీల్లో పాల్గొన్నాయి. సుమారు రూ.16 లక్షలు విలువ చేసే బహుమతులు అందజేశారు. కానుకమాత కోడె గిత్తల కమిటీకి చెందిన వైఎల్ మర్రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ఆదూరి ఇన్నారెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, జోసఫ్ రెడ్డి, రాజారెడ్డి, ఏరువ జోజిరెడ్డి, వెన్నా కోటిరెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

పెదనందిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై అత్యాచారం ఆపై హత్య కేసులో నిందితులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. గతంలో పలు అత్యాచార కేసుల్లో ఉన్న నిందితుడు పాలపర్తి మంజు, అతని సోదరులను విచారణ చేస్తున్నారు. హత్య జరిగిన సమీపంలోనే నిందితులు ఉండడం, వీరిపై అనుమానాలు ఉండటంతో, విచారణ చేసేందుకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 550.20 అడుగులు ఉంది. ఇది 210.21 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9330 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,163 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,05,330 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,20,593 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,05,330 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 74,044 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	9000	10500
నెంబరు. 5	10500	13000	నెంబరు.5	--	--
273	--	--	273	--	--
341	8500	14500	341	10000	11000
4884	12000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	14500	తేజ	8500	13000
బ్యాడిగి	7000	13200	బ్యాడిగి	9000	10500
దేవనూరు డీలక్స్	7500	13000	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	10000

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 34.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని రాజు తెలిపారు.

శ్రీవాసవీ వృద్ధాశ్రమ నూతన కమిటీ ఎన్నిక

గురజాలటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాడుగుల రోడ్డులో గల శ్రీవాసవీ వృద్ధాశ్రమ నూతన కమిటిని సోమవారం ఆశ్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల పిచ్చయ్యగుప్తా, ప్రధాన కార్యదర్శిగా సూర్య మల్లికార్జునరావు, కోశాధికారిగా ఊటుకూరి నరసింహారావు, సభ్యులుగా దివ్వల సాంబశివరావు, పాదర్తి రాంబాబు, ఆత్మకూరి వెంకట పుల్లారావు, పెరుమాళ్ల సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 830

రెంటచింతల,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 830 మందిగా తేలిందని తహసీల్దార్ ఎం.అర్జున్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుందని, పోలింగ్ కేంద్రాన్ని వైఆర్ఎస్ హైస్కూలో ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

7న పూర్వ విద్యార్థుల సమావేశం

రెంటచింతల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 7న నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1949లో ఈ పాఠశాలను స్థాపించగా వజ్రోత్సవ వేడుకలను (75 సంవత్సరాలు) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులంతా 7వ తేది ఉదయం 9గంటలకు పాఠశాలలో హాజరుకావాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

రెంటచింతల,ఫిబ్రవరి 3: రెంటచింతలలోని గోలి వాగు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఆదివారం అర్ధరాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెంటచింతలకు చెందిన కర్నాటి కిషోర్, బీహార్ రాష్ట్రానికి చెందిన సందీప్ శర్మ, బికారిశర్మలు గాయపడ్డారు. వీరిని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆస్పత్రులకు తరలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మాచర్లటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మునిసిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించండి

బెల్లంకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన దారులు ప్రయాణ సమయంలో హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని, లైసెన్స్‌లు లేని వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి ..

గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని మాచాయపాలెంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని, అనుమానితులు ఎవరైనా కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

బెల్లంకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. సంత పంచమి వేడుకల సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వసంత పంచమిని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి పూజను జరిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిరీటిరెడ్డి, విజయకుమారి, షేక్ షకీనా, నాగమణి, ఉషారాణి, ఆదిలక్ష్మి, కేశవరెడ్డి, కొర్లయ్య, ఏడుకొండలు, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.


దాచేపల్లి (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లిలోని వీర్లంకమ్మ తల్లి దేవాలయంలో వీర్లంకమ్మ తల్లిని సరస్వతి దేవిగా అలంకరించి పూజలు చేశారు. సోమవారం సరస్వతి దేవి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా అమ్మవారికి విశేష రోజు కావటంతో చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన సాగి నరసింహామూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు యనమల నరేష్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు.

వైసీపీ ధర్నా పిలుపు హాస్యాస్పదం

వెల్దుర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గతంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయని వైసీపీ నేడు ఫీజుపోరు అంటూ ధర్నా పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి 8 నెలల పాలనలో రూ. 800 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేసిందని శివారెడ్డి గుర్తుచేశారు.

సమస్యల నెలవు.. క్రోసూరు

- వేధిస్తున్న తాగునీటి సమస్య
- పైపు లైన్లు సరి లేవు.. నీటి సరఫరా లేదు..
- బస్టాండ్ లేక ప్రయాణికుల ఇబ్బందులు
- సామాజిక మరుగుదొడ్లు లేక జనం పాట్లు
- ట్రాఫిక్, మురుగు నీటి సమస్య నిత్యకృత్యం



క్రోసూరు ఏరియల్ వ్యూ



రోడ్లపైకి చేరిన మురుగు నీరు (ఫైల్)

మండల కేంద్రం క్రోసూరు జనాభా సుమారు 13 వేలు. 3,300 గృహాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, సామాజిక మరుగుదొడ్లు, మురుగు నీటి పారుదల వంటి సమస్యలు ఎన్నో ఏళ్లుగా ప్రజలను పట్టి పీడి స్తున్నాయి. సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా అధికారులకు, నేతలు విజ్ఞాపనలు చేస్తున్నా అవన్నీ బుట్టదాఖ లవుతూనే ఉన్నాయి. కూటమి పాలనలోనైనా పరిస్థితి మారేనా.. అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

క్రోసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం క్రోసూరులో ప్రధాన సమస్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలోని పలు కాలనీల్లోని ప్రజలను మురుగు నీటి పారుదల సమస్య పట్టి పీడిస్తోంది. కాలువలు సక్రమంగా లేక ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచి పోతుంది. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధాన్ని వెదజల్లుతోంది.

సత్తెనపల్లి, గుంటూరు, పిడుగురాళ్ళ డిపోలకు చెందిన పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ప్రతి రోజు మండల కేంద్రానికి వచ్చి పోతూ ఉన్నప్పటికీ బస్టాండ్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలో, వానలో రోడ్ల పైనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. అలాగే గ్రామంలో ఎక్కడా సామాజిక మరుగుదొడ్డు లేవు. దీంతో ఇతర గ్రామాల నుంచి వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రజలను మంచి నీటి సమస్య పట్టి పీడిస్తుంది. రక్షిత మంచి నీటి పథకం ఉన్నప్పటికీ పైపులైన్‌లు సక్రమంగా లేక వివిధ కాలనీలోని మంచి నీటి ట్యాంకులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలి పోతున్నాయి. గ్రామంలోని సగం మందికిపైగా భూముల సర్వే నెంబరు తప్పుగా నమోదు కావటంతో రిజిస్ట్రేషన్‌ల సమస్యతో సతమతమవుతున్నారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలు అధికం కావటంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందలకు గురవుతున్నారు.



రోడ్డు మధ్యలో పైపులైన్‌ల కోసం తవ్విన కాలువ

సామాజిక మరుగు దొడ్ల కోసం పోరాడుతున్నాం



క్రోసూరులో సామాజిక మరుగు దొడ్ల కోసం దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నాం. రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేశాం. అధికారులు, నేతల నుంచి హామీలే గానీ, ఆచరణాత్మక చర్యలు ఏవీ లేవు. ఈ సమస్య పరిష్కారమైతే మండలంలోని అనేక మందికి ఎంతో మేలు జరుగుతుంది.

- వడ్లమూడి బాలకృష్ణ, న్యాయవాది

భూగర్భ డ్రైయినేజీని ఏర్పాటు చేయాలి :



క్రోసూరులో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరు కాలువల్లో నుంచి పొర్లి రోడ్లపైకి చేరుతోంది. ఈ సమస్యను పరిష్కారం కావాలంటే భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అలాగే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

- బండారు మైనూర్ బాబు, స్థానికుడు

పైపులైన్‌ల కోసం తవ్విన కాలువలు పూడ్చాలి..



క్రోసూరులోని పలు కాలనీల్లో రెండేళ్ల క్రితం మంచి నీటి పైపులైన్ ఏర్పాటు కోసం సిమెంట్ రోడ్ల మధ్యలో కాలువలను తవ్వారు. ఇప్పటికీ పైప్ లైన్ వేసింది.. కాలువలు పూడ్చింది లేదు. దీంతో ఆ గుంతలు పూడ్చని రోడ్లపై నడవాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- దుద్దుల యోహాన్

'పది' ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

● జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

రాజుపాలెం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ప్రతి ఒక్క విద్యార్థినీ ఇష్టంతో కష్టపడి చదువుకొని ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషిచేయాలని పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని, గణపవరం, అనుపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగాఉపాధ్యాయినులతో డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం మన ముందు చాలా తక్కువ సమయం ఉందని, 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేద్దామన్నారు. ఎవరైనా చదువులో వెనుకబడిన్నట్లు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి పాస్ అయ్యేలా చూడాలన్నారు.



10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

అనంతరం మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల తల్లిదండ్రుల పట్ల బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి దురుసుగా ప్రవర్తిస్తున్న తీరు డీఈవో దృష్టికిరాగా, భవిష్యత్‌లో ఆ విధంగా జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో నకరికల్లు జడ్పీ హైస్కూల్ జట్టు

వాలీబాల్ రన్నర్స్‌గా నకరికల్లు జడ్పీ హైస్కూల్ జట్టు

నకరికల్లు ,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): బాల మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ నిర్వహించిన అండర్ - 14 బాలుర వాలీబాల్ పోటీల్లో నకరికల్లు ఎస్‌వీవీఆర్ జడ్పీ హైస్కూల్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్టు హెచ్‌ఎం తుర్లపాటి నగేష్ తెలిపారు. రన్నర్స్‌గా నిలిచిన జట్టు బాలురకు రూ.3వేలు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఫిజికల్ డైరెక్టర్లు, హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం

క్రోసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని సోమవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచంలో మొట్ట మొదటి వైద్య పట్టా పొందిన ఎలిజిబెత్ బ్లాక్ వెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యాధికారి డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ మహిళలు వైద్య రంగంలో అద్భుతాలు సాధిస్తున్నారంటే దానికి పునాదులు వేసిన ఘనత డాక్టర్ బ్లాక్‌వెల్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి డాక్టర్ సిరిచందన, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సీహెచ్‌వో సాంబశివరావు,హెల్త్ సూపర్ వైజర్ శివుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం

క్రోసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు తహసీల్దారుగా నియమితులైన వేములవెంకట నాగ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శావల్యాపురం డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారును కార్యాలయసిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నేతలు తహసీల్దారుని కలిసి అభినందనలు తెలిపారు.

మాచవరం,(ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం నూతన తహసీల్దారుగా ఎన్. నాగమల్లేశ్వర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతి తహసీల్దారుగా పని చేస్తున్న నాగమల్లేశ్వరరావు బదిలీపై మాచవరం వచ్చారు.

భూ రికార్డుల పరిశీలన

రాజుపాలెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ రికార్డులను ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రాచేటి చంద్ర పాల్ తన వ్యవసాయ సాగుభూమిని వ్యాపార భూమిగా బదలయింపు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిలో భాగంగా సర్వే నెంబరు 233, 234, 235/5లోని భూమి వద్దకు ఆర్డీవో వచ్చి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వర రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

క్రోసూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుకూరు యూపీ స్కూల్లో ఎంఈవో ఏకుల ప్రసాదరావు సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు పాటించాల్సిన నిమయ నిబంధనల గురించి వివరించారు. మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశించారు.

మహిళ కడుపులో నుంచి 5.5 కిలోల గడ్డ తొలగింపు



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ పిడికిటి నవ్య, తొలగించిన 5.5 కిలోల బరువున్న కణిత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ కడుపులో నుంచి 5.5 కిలోల బరువున్న గడ్డ (కణిత)ను పట్టణంలోని శ్రీసాయి బాలాజీ తల్లి పిల్లల హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. పిడుగురాళ్లకు చెందిన బత్తుల అనూష (40) అనే మహిళ నెల రోజుల నుంచి తీవ్ర కడుపు నొప్పి, రక్తస్రావంతో బాధపడుతోంది. ఆమెను ఆదివారం బంధువులు శ్రీ సాయిబాలాజి తల్లిపిల్లల ఆస్పత్రికి తీసుకు వచ్చారు. డాక్టర్ పిడికిటి నవ్య అనుషకు పలు వైద్యపరీక్షలు నిర్వహించి గర్భసంచి పక్కన పెద్ద కణిత ఉందని నిర్ధారించింది, తక్షణమే శస్త్రచికిత్స చేసి దానిని తొలగించాలని రోగి బంధువులకు వివరించింది. సోమవారం ఉదయం ఆస్పత్రి వైద్య బృందం అనుషకు శస్త్ర చికిత్స చేసి 5.5 కేజీల బరువు ఉన్న ఆ కణితను తొలగించారు. అయితే ఆ శస్త్ర చికిత్సకు ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఆరోగ్యశ్రీ ద్వారా చేసినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా , టీడీపీ నేతలు పలువురు

గ్రామ దేవతల వార్షికోత్సవం

● హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో కొలువైన ఆంజనేయ స్వామి, బ్రహ్మం గారు, గ్రామ దేవతలు పోలేరమ్మ, అంకమ్మ, గంగమ్మ, గంటలమ్మ తల్లుల నాల్గువ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, గ్రామస్థులు సులగా వెంకట అప్పారావు, మాజీ సర్పంచ్‌లు అల్లంశెట్టి ఆనందరావు, యమార్తి శ్రీను, దుడ్డు అప్పారావు తదితరులు ఉన్నారు.

పేదల నుంచి అర్జీల స్వీకరణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇళ్ళ స్థలాలు లేని పేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఇళ్ళస్థలాల అర్జీల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని, ఇళ్ళు కట్టించాలని కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను తెచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇళ్ళ స్థలాలు ఇవ్వటానికి సిద్ధమైందన్నారు. అర్హులైన వారంతా ఇళ్ళ స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వల్లెం చెన్నకేశవరావు, శేషగిరిరావు, కంభాల శ్రీనివాసరావు, జీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'లక్షడప్పులు, వేల గొంతుకలు' వాల్‌పోస్టరు ఆవిష్కరణ

రెంటచింతల,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను కోరుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్షడప్పులు, వేల గొంతుకలు' కార్యక్రమ వాల్ పోస్టర్లను సోమవారం రెంటచింతలలో ఎమ్మార్పీఎస్ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గడిపర్తి శ్రీనివాసరావు,తాళ్లూరి జీవరత్నం,కర్ర ముసలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదిగ యువసేన మండల అధ్యక్షుడిగా దేగల జక్రయ్యను ఎన్నుకున్నారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో జరగనున్న లక్షడప్పుల, వేల గొంతుకలు సభ, ర్యాలీలో మాదిగలు, మాదిగ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగ నేతలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేతలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో చిలకా అగస్టీన్ బాబు, పొంగూరి అశోక్, కందుల అంబేద్కర్, చుక్కర కమలాకర్, డయాన్, సాల్మన్ రాజు, సునీల్, దేగల రాంబాబు, కొల్లా రామారావు, కూచిపూడి కృపాకర్, జీవన్, శామ్ పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు వేగవంతం

పెదకూరపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో అమరావతి మేజరు కాలువలోని నాచు, తూటి కాడ తొలగింపు పనులను వేగవంతం చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్తిమళ్ళ రమేష్‌లు సోమవారం ఆయా పనులు పరిశీలించారు. కాలువ చివరి భూములకు సాగు నీరు అందించాలన్నదే లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మక్కెన సాగర్, దాసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి నూతన పాలకవర్గంతో యరపతినేని నిఖిల్

నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

● ముఖ్య అతిథిగా హాజరైన యరపతి నిఖిల్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే యరపతినేని ఎంతో అండగా ఉన్నారన్నారు. వ్యాపారంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నా, స్థానిక పార్టీ నేతల నుంచి ఏ సమస్య ఎదురైనా ఎమ్మెల్యే యరపతినేని ఉపేక్షించరని, ఆర్యవైశ్యులకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేచూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండాలని, సామాజిక సేవ, భక్తి కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ అధ్యక్షుడిగా ఏలూరి చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శిగా కొలిశెట్టి సుబ్బారావు, కోశాధికారిగా కొత్తా లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షునిగా గుడివాడ కుటుంబరావు, ప్రధాన కార్యదర్శిగా వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావు, కోశాధికారిగా కొత్తా వెంకట కోటేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్ దంపతులు అమ్మవారికి శ్రీచక్ర తొడుగు నిమిత్తం రూ. 17 లక్షల విలువైన రెండు బంగారు బిస్కెట్లను అందించారు. కార్యక్రమంలో కొత్త వెంకట సుబ్బారావు, పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, కట్టమూరి శంకరరావు, కొత్తా రఘురామయ్య, ఊరా భాస్కరరావు, ఉడతా శ్రీను, జూలకంటి సుబ్రహ్మణ్యం, కట్టమూరి శంకరరావు, పీవీఎస్ రమేష్, అత్తులూరి సుబ్బారావు, నైరుమళ్ల రాజేష్, రెడ్డి సాంబశివరావు, చందోలు రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

● నేడు ఉదయం 11 గంటలకు ఎన్నిక.. సభ్యులందరూ హాజరుకావాలి

● ఎన్నికల ప్రత్యేకాధికారి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల ప్రత్యేకాధికారి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లు, కొందరు నేతలు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనలకు దిగారు. అదేసమయంలో టీడీపీ కౌన్సిలర్లు అక్కడే ఉండటంతో వారి మధ్య కొద్దిసేపు వాగ్వివాదాలు సాగాయి. ఈ క్రమంలో గురజాల డీఎస్పీ జగదీష్, పట్టణ సీఐ వెంకట్రావులు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణిగించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లు సమావేశం హాలుకు చేరుకున్నారు. ఎన్నికలు ఎందుకు వాయిదా వేశారో చెప్పాలని ప్రత్యేకాధికారి మురళీకృష్ణను కౌన్సిలర్లు కోరారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఉదయం 11 గంటలకు జరుగుతుందని సభ్యులకు తెలిపామని, 10 గంటలలోపు వైస్ చైర్మన్ ఎన్నిక అభ్యర్థి ఎవరనేది గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నుంచి ఫారం - ఏ, బీలను గంట ముందుగా ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉందన్నారు. కానీ ఆయా ఫారాలను ఎవరూ సమర్పించక పోవడంతో ఎన్నికల నిబంధన ప్రకారం ఎన్నికను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీధర్, ఏఈ రాఘవేంద్రలు పాల్గొన్నారు.

హామీ ఇస్తేనే పెగ్ మార్క్‌కు అనుమతిస్తాం

● రైల్వే లైన్ ఏర్పాటులో భూమి కోల్పోతున్న రైతుల నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) తెలంగాణా రాష్ట్రం ఖమ్మం సమీపంలోని ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు నూతనంగా నిర్మించనున్న రైల్వేలైనుకు సంబంధించి పల్నాడు జిల్లాలో 330 ఎకరాలు భూమి సేకరించాల్సి ఉంది. అమరావతి మండల పరిధిలో కర్లపూడి, ఎండ్రాయి, వైకుంఠపురం గ్రామాల పరిధిలో ఈ భూమికి ప్రభుత్వం గెజిట్ విడుదల చేసి రైతుల అభిప్రాయాలను కోరింది. మూడు గ్రామాలకు చెందిన 58 మంది రైతులు అభ్యంతరాలను తెలియజేయగా ఈనెల 12న ఆర్డీఓ వారితో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఇంతలో రైల్వే అధికారులు ఈ మూడు గ్రామాలలో ఈనెల 5న సేకరించాల్సిన భూమికి సంబంధించి పెగ్‌మార్కు పెట్టెందుకు సిద్ధమై రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో సోమవారం తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చ్యులు కర్లపూడి గ్రామానికి చెందిన రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను అడిగారు. తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారానికి సంబంధించి ఖచ్చితమైన హామీ ఇస్తేనే పెగ్‌మార్క్‌కు అనుమతిస్తామని రైతులు స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్‌ఐలు అమీర్, రాజశేఖర్, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వేద పండితులు పీ ఫణి కుమార్‌శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో కన్నా భాస్కరార్జి, నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీధర్, చిన సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, ధనలక్ష్మి, రవి కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చిత్ర హింసలు కేసులో

తల్లి పేరు మాధవి కాదు దరియాబీ !

సత్తెనపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో చిన్నారిని అట్లకాడతో కాల్చి చిత్రహింసలు పెట్టిన తల్లి మాధవి అసలు పేరు దరియాబీ అని పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. దరియాబీ ఆధార్‌లో తన పేరును మార్చుకునే క్రమంలో భర్త సమీర్ ఫోన్ నంబరుకి ఓటీపీ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ నంబరు పోలీసులు సమీర్‌ను పిలిపించి విచారించగా అనేక విషయాలు వెలుగు చూశాయి. గుంటూరులోని చాకలికుంటకు చెందిన షేక్ షమీర్ భార్య దరియాబీ, తన పేరును మాధవిగా మార్చుకున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడించారు. దరియాబీ సమీర్ వద్ద ఉంటూ సమీర్ ఇంటిలో, అతని తల్లి ఇంటిలో రూ.7 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను అపహరించి పారిపోయింది. ఈ ఘటనపై సమీర్ 2024 జూన్‌లో గుంటూరు లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇప్పుడు ఆభరణాలు దొంగతనం కేసులోనూ దరియాబీని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

భక్తిశ్రద్ధలతో తేరు ఊరేగింపు

● ముగిసిన కానుకమాత తిరునాళ్ల మహోత్సవాలు

రెంటచింతల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 175వ కానుకమాత తిరునాళ్ల నేత్రపర్వంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన తేరు ప్రదర్శన సోమవారం ఉదయం 7 గంటల వరకు సాగుతూనే ఉంది. యువతీ యువకులు తేరును లాగడానికి ఉత్సాహంచూపారు. కిందటేడాది మాదిరిగానే ఏ అల్లర్లకు ఆస్కారం లేకుండా తిరునాళ్ల ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



పురవీధుల్లో తేరు ఊరేగింపు దృశ్యం

బాలికలు.. భళా

పేదరికం.. ఆపై అమ్మాయిలు.. అయినా మట్టిలో మాణిక్యాల్లా మెరిశారు. బాలికలైనా భళా అని పిలిపించుకున్నారు. మారుమూల పల్లె అయినా.. సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని శావల్యాపురం జడ్పీ పాఠశాల బాలికలు నిరూపించారు. బడిలో చేరినప్పటి నుంచే ఆటలపై ఉన్న మక్కువతో బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడను ఎంచుకుని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో అంచెలంచెలుగా రాణించి చివరికి జాతీయస్థాయి పోటీలో కూడా తమసత్తా చాటారు. ప్రతిభకు పేదరికం ఏ మాత్రం అడ్డు కాదని లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదని నిరూపిం చారు. బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడలో జాతీయస్థాయిలో రాణించి తల్లిదండ్రులకు, పుట్టి పెరిగిన గ్రామంతో పాటు విద్యాబుద్దులు నేర్పిన శావల్యాపురం జడ్పీపాఠశాలకు పేరుప్రఖ్యాతులను సాధించిపెట్టారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు ప్రతిష్ఠాత్మకమైన క్రీడాప్రతిభా అవార్డును సొంతం చేశారు.

- బాల్‌ బ్యాడ్మింటన్‌లో విద్యార్థినుల హవా
- మారుమూల పల్లె నుంచి జాతీయ స్థాయికి
- అంచెలంచెలుగా ఎదిగిన శావల్యాపురం జడ్పీ బాలికలు

శావల్యాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చదువే లోకంగా మారిన ప్రస్తుత సమాజంలో అందరిలా కాదు.. తాము భిన్నమని నిరూపించారు ఆ బాలికలు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నో జడ్పీ పాఠశాలలు ఉన్నాయి.. వాటిలో ఎందరో విద్యను కొనసాగిస్తున్నారు. కానీ వినుకొండ నియోజకవర్గ పరిధిలోని శావల్యాపురం జడ్పీ పాఠశాలలో బాలికలు మాత్రం ప్రత్యేకంగా నిలిచారు. ఆటల్లో తమకున్న ఆసక్తికి మెరుగులద్ది జాతీయ స్థాయిలో రాణించి భళా అనిపించుకున్నారు. స్పోర్ట్స్‌ కోటాలో సీట్లు సాధించి పాఠశాలకు జాతీయస్థాయిలో పేరుతెచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్‌ అసోషియేషన్‌ అధ్యక్షుడు శివశంకర్‌, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రోత్సాహం, జిల్లా జాయింట్‌ సెక్రటరి, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి ప్రేరణలో బాలికలు బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీల్లో జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచారు. పాఠశాలలో సీనియర్‌ ఇంటర్‌ చదువుతున్న ఆకుమల్ల సమీర(శానంపూడి), కామినీడి కావ్య(శావల్యాపురం), జూనియర్‌ ఇంటర్‌ చదువుతున్న వేముల దివ్య(శావల్యాపురం), ముట్లూరి లూధియా, బండారు దేవమణి(బొందిలిపాలెం) ఇటీవల జాతీయస్థాయి పోటీలకు ఎంపికై రాణించారు. కనమర్లపూడి గ్రామానికి చెందిన ముక్కపాటి లిఖిత, ఉప్పు బసవరాణి జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. స్పోర్ట్స్‌కోటాలో ముక్కపాటి లిఖిత చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తుంది. ఉప్పు బసవరాణి నూజివీడు ట్రిపుల్‌ ఐటీ కళాశాలలో చదువుకుంటుంది. బొందిలిపాలెం గ్రామానికి చెందిన రావినూతల రత్నకీర్తన, 9వతరగతి చదువుతున్న కనమర్లపూడి గ్రామానికి చెందిన చల్లా శ్రీహర్షిత, ఉప్పు లలిత, బండారు రవళిలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. యోగా, వాలీబాల్‌, రోప్‌ స్కిప్పింగ్‌, త్రోబాల్‌ తదితర క్రీడల్లో పలువురు విద్యార్థులు స్కూల్‌గేమ్స్‌, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. 2019లో జిల్లాస్థాయి జోనల్‌ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాల జట్టు చాంపియన్స్‌గా నిలిచింది. 2023లో జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీల్లో మహిళల క్రికెట్‌ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. 2024-25 విద్యాసంవత్సరంలో శావల్యాపురం జడ్పీపాఠశాల క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది.



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు (ఫైల్)

చిన్నప్పటి నుంచే.. బసవరాణి

ఉప్పు బసవరాణి చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువతో రాణిస్తోంది. అంచెలంచెలుగా రాణిస్తూ జూనియర్‌ బాలికల విభాగంలో ఆల్‌ ఇండియా స్థాయిలో రెండోర్యాంక్‌ సాధించింది. 16కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



దేవమణికి రెండో ర్యాంకు

జూనియర్‌ ఇంటర్‌ చదువుతున్న బొందిలిపాలేనికి చెందిన బండారు దేవమణి బాల్‌బ్యాడ్మింటన్‌లో సబ్‌ జూనియర్స్‌ బాలికల విభాగంలో ఆల్‌ ఇండియా స్థాయిలో రెండోర్యాంక్‌ సాధించింది. 10కి పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది.



జాతీయ స్థాయిలో లిఖిత.. బంగారం

ముక్కపాటి లిఖిత బాల్‌బ్యాడ్మింటన్‌లో నాలుగు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. ఆల్‌ ఇండియా ఇంటర్‌ యూనివర్సిటీ పోటీల్లో గోల్డ్‌మెడల్‌ సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మెడల్స్‌ సాధించింది.



జాతీయస్థాయిలో రాణించడం శుభపరిణామం



జాతీయస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు బాలికలు ఎంపికై రాణించడం శుభపరిణామం. ఆరో తరగతి నుంచే బాలికల్లో ప్రతిభను గుర్తించి పీడీ రాధాకృష్ణమూర్తి ప్రేరణ ఇచ్చి వారిని ఉన్నతస్థాయికి చేర్చేలా కృషి చేస్తున్నారు. బాలికలు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించాం. మిగిలిన విద్యార్థులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలి.

- బొడ్డపాటి విజయలక్ష్మి, హెచ్‌ఎం

ఉన్నతస్థాయికి ఎదగాలి



బాలికలు పురుషులకు దీటుగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. స్పోర్ట్స్‌కోటాలో చదువుల్లో 2 శాతం, ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్‌ ఉన్నందున బాలికలు క్రీడల్లో ప్రణాళికాబద్ధంగా రాణించాలి. చిన్నతనం నుంచే లక్ష్యాలను కేటాయించుకొని వాటిని సాధించేందుకు కృషి, పట్టుదలతో సాధన చేయాలి. పదేళ్లుగా ఎంతోమంది విద్యార్థులను క్రీడల్లో ఉన్నతస్థాయికి చేర్చడం ఆనందంగా ఉంది. క్రీడాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారాన్ని బాలికలు సద్వినియోగం చేసుకుని రాణించడం శుభపరిణామం.

- రాగుల రాధాకృష్ణమూర్తి, పీడీ

నేషనల్‌ మెడల్స్‌ సాధించిన సమీర

సీనియర్‌ ఇంటర్‌ చదువుతున్న శానంపూడి గ్రామానికి చెందిన ఆకుమల్ల సమీర బాల్‌బ్యాడ్మింటన్‌ క్రీడలో సీనియర్‌ నేషనల్‌ మెడల్‌ ఆల్‌ ఇండియా రెండో ర్యాంక్‌ సాధించింది. సబ్‌ జూనియర్స్‌ నేషనల్‌ మెడల్‌తో పాటు స్కూల్‌గేమ్స్‌ నేషనల్‌ మెడల్‌, పెడరేషన్‌ కప్‌ నేషనల్‌ మెడల్‌ సాధించింది. 20కి పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది.



కావ్య.. ఆల్‌ఇండియాలో ద్వితీయ స్థానం

సీనియర్‌ ఇంటర్‌ విద్యార్థిని అయిన శావల్యాపురానికి చెందిన కామినీడి కావ్య బాల్‌ బ్యాడ్మింటన్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్‌-19 జూనియర్‌ బాలికల విభాగంలో ఆల్‌ ఇండియా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. 15కిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



దివ్య.. సబ్‌జూనియర్స్‌లో రెండో ర్యాంకు

జూనియర్‌ ఇంటర్‌ చదువుతున్న శావల్యాపురానికి చెందిన వేముల దివ్య బాల్‌బ్యాడ్మింటన్‌లో సబ్‌జూనియర్స్‌ విభాగంలో ఆల్‌ ఇండియా స్థాయిలో రెండో ర్యాంక్‌ సాధించింది. స్కూల్‌ గేమ్స్‌లో నేషనల్స్‌కు ఎంపికైంది. 15కిపైగా రాష్ట్ర స్థాయి పోటీల్లో బహుమతులు సాధించింది.



లూధియాకు పతకాలే పతకాలు..

జూనియర్‌ ఇంటర్‌ చదువుతున్న శావల్యాపురానికి చెందిన ముట్లూరి లూధియా ఆరేళ్లలో పాఠశాలస్థాయి నుంచి జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీలకు ఎంపికైంది. సబ్‌ జూనియర్స్‌ విభాగంలో ఆల్‌ఇండియాలో రెండో స్థానం సాధించింది. 15కు పైగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించింది.



మంగళగిరికి మంచి రోజులొచ్చాయి. దేశమంతా మంగళగిరి వైపు తిరిగి చూసేలా తన పనితీరు ఉండబోతుందని పదేపదే చెప్పుకొచ్చిన మంత్రి నారా లోకేశ్‌.. ఆ దిశగా తన ప్లాన్‌ ఆఫ్‌ యాక్షన్‌ను చాలా వేగంగా ప్రారంభించారు. దేశంలో అతిపెద్ద గోల్డ్‌హబ్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేయించేందుకు కృషి సాగిస్తూనే.. రూ.294 కోట్ల వ్యయంతో తాడేపల్లి సీతానగరం వద్ద మహానాడు వరద ముంపు బాధితుల ప్రయోజనార్థం కృష్ణానదికి రిటైనింగ్‌వాల్‌ నిర్మాణం.. చేనేతల సంక్షేమం కోసం 11 ఎకరాల విస్తీర్ణంలో మెగా చేనేత పార్కు వంటి భారీ ప్రాజెక్టులతో మంగళగిరి అభివృద్ధిని లోకేశ్‌ పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ఒరవడిలోనే మంగళగిరి ప్రజల ఆరోగ్యం కోసం వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.53 కోట్లను మంజూరు చేయడంతోపాటు నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎంఎస్‌ఐడీసీకి అప్పగించి టెండర్లను పిలవడంతోపాటు కాంట్రాక్టును కూడా ఫైనలైజ్‌ చేయించింది. భార్గవ్‌ కనస్ట్రక్షన్స్‌ అనే సంస్థ ఆధ్వర్యంలో ఈ వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగనుంది. రాగల 15 రోజుల వ్యవధిలో శంకుస్థాపన జరిపించి ఏడాదిలోగా భవన నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రారంభించేలా ఏపీఎంఎస్‌ఐడీసీ చొరవ చూపాలని మంత్రి లోకేశ్‌ ఆదేశించారు.

ఇక్కడ కాదు.. అక్కడ..!



వంద పడకల ఆస్పత్రి కోసం ఎంపిక చేసిన చినకాకాని క్యాన్సర్‌ హాస్పిటల్‌ ప్రాంగణం



- చినకాకానికి ప్రభుత్వాస్పత్రి తరలింపు
- క్యాన్సర్‌ హాస్పిటల్‌ ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి
- రూ.53 కోట్లతో నిర్మాణం
- జీ ప్లస్‌ వన్‌ భవనసముదాయంగా ఏర్పాటు
- తరలింపును స్వాగతిస్తున్న ప్రజలు

మంగళగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రి అనేది మంగళగిరి ప్రజలకు ఎప్పటి నుంచో ఉన్న వాంఛ! 1986 ప్రాంతంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే దేవస్థానానికి ఎదురుగా నాలుగెకరాల విస్తీర్ణంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి భవనాన్ని ఏర్పాటుచేశారు. అయితే 15 ఏళ్ల నుంచి అది శిథిలమవుతూ రావడంతోపాటు వైద్యవిధాన పరిషత్‌ నిర్వహణలో కుంటుపడుతూ వచ్చింది. చివరకు భవనం కప్పంతా కారిపోతుండడం.. 30 పడకలకు బదులు కనీసం మూడు పడకలు కూడ లేనటువంటి దీనస్థితికి వచ్చింది. దీంతో మంగళగిరి ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కయ్యాయి. కొన్ని ప్రజాసంఘాలు పదేళ్లుగా మంగళగిరికి వంద పడకల ఆస్పత్రి కావాలంటూ పోరాడుతూ వచ్చాయి. రాష్ట్ర విభజన పుణ్యమో! లోకేశ్‌ వచ్చిన పుణ్యమో!! ఏదైతేనేమి!!! ఇన్నాళ్లకు వంద పడకల ఆస్పత్రి అనే చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది.

చినకాకాని క్యాన్సర్‌ ఆస్పత్రి ప్రాంగణానికి తరలింపు

రూ.53 కోట్లతో చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండడంతో.. ఈ భవన నిర్మాణ విషయంలో మంత్రి లోకేశ్‌ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు...సూచనల మేరకు ఆస్పత్రిని ప్రస్తుత శిథిల భవనం స్థానంలో కాకుండా జాతీయ రహదారి వెంబడి చినకాకాని క్యాన్సర్‌ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించాలని నిర్ణయించారు. చినకాకానిలో సర్వే నెంబరు 172/14లో పదెకరాల విస్తీర్ణంలో క్యాన్సర్‌ ఆస్పత్రి భవనం ఉంది. ఇది కూడా నిర్వహణ లోపంతో దాదాపు మూతపడిన దశలో ప్రాంగణమంతా నిరుపయోగంగా ఉంది. నగరంలో దేవస్థానానికి ఎదురుగా ఉన్న ప్రస్తుత ఆస్పత్రి స్థలంలో దీనిని నిర్మిస్తే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అక్కడ ఆస్పత్రికి దారితీసే వీధులన్నీ చాలా ఇరుకుగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల్లో మరణించినవారిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తీసుకురావడం.. తీసుకుపోవడం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ముందరగా జరపాల్సివస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేశ్‌ నూతన ఆస్పత్రి భవనాన్ని క్యాన్సర్‌ హాస్పిటల్‌ ప్రాంగణంలో నిర్మించడమే సముచితమన్న నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలందరూ స్వాగతిస్తున్నారు కూడా!

96మంది సిబ్బందితో..

ఆస్పత్రిలో సుమారు 24 మంది వైద్య నిపుణులు వివిధ విభాగాల్లో అందుబాటులో ఉంటారు. రెండో గ్రేడు నర్సింగ్‌ సూపరింటెండెంట్‌తో పాటు నలుగురు హెడ్‌ నర్సులు, 24మంది స్టాఫ్‌ నర్సులు ఉంటారు. వీరుగాక మరో 43 మంది సిబ్బంది వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తారు. మొత్తంగా 96మంది సిబ్బంది ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులను ఇచ్చింది.

ఆస్పత్రి రూపు రేఖలిలా..

చినకాకాని క్యాన్సర్‌ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించనున్న కొత్త భవనాన్ని ప్రస్తుతానికి 5.5 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టాలని నిర్ణయించారు. లక్షా 20వేల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చే విధంగా గ్రౌండు అండ్‌ ఫస్ట్‌ ఫ్లోర్‌ భవనంగా దీనిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఆస్పత్రి భవనం చుట్టూ నాలుగు రోడ్లు రావడంతో ఉత్తరంవైపు ఈశాన్యంగా ప్రధాన ముఖద్వారాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ ముఖద్వారానికి భవనానికి మధ్య ఎకరం విస్తీర్ణంలో గ్రీనరీని ఏర్పాటు చేస్తారు. అలాగే పశ్చిమంగా ఉండే జాతీయరహదారి నుంచి ఆస్పత్రిలోకి దారి తీసేందుకు రెండో ప్రవేశ మార్గాన్ని ఏర్పాటుచేస్తారు. ఇవన్నీ నాలుగెకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతాయి. తూర్పువైపు మరో 1.5 ఎకరాల విస్తీర్ణంలో గ్రీనరీని ఏర్పాటుచేసి ఇందులో మార్చురీతోపాటు రోగుల బంధువులు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేస్తారు. అంటే ప్రస్తుతానికి 5.5 ఎకరాలను వినియోగిస్తారన్నమాట! మిగిలిన 4.5 ఎకరాలను ఆస్పత్రి భావి అవసరాల నిమిత్తం రిజర్వు చేసి ఉంచుతారు. ఆస్పత్రి డిజైన్‌లను ఖరారు చేసేందుకు దేశంలో ఉన్న ప్రధానమైన ప్రఖ్యాత ఆస్పత్రుల భవనాలను పరిశీలించి వాటిలో మెరుగ్గా ఉన్న డిజైన్‌లను పరిగణనలోకి తీసుకోవాలని కూడా మంత్రి లోకేశ్‌ ఇటీవలి సమీక్షలో అధికారులను ఆదేశించారు.

నాణ్యతలో రాజీ పడేది లేదు : చిల్లపల్లి



వంద పడకల ఆస్పత్రిని చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నామని.. నిర్మాణ విషయంలో మంచి నాణ్యతా ప్రమాణాలను పాటించి తీరుతామని ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్‌ చిల్లపల్లి శ్రీనివాసరావు చెప్పారు. భవన నిర్మాణ పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలన్న మంత్రి లోకేశ్‌ ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తామన్నారు. మంగళగిరితో పాటు పిఠాపురంలో కూడ వంద పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. మంత్రి సత్యకుమార్‌ నియోజకవర్గం ధర్మవరంలో కూడ వంద పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

విజయకీలాద్రిపై ధ్వజారోహణ

- మంగళశాసనాలు అందించిన చినజీయర్‌ స్వామి

తాడేపల్లి టౌన్‌, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షలో సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో రెండవ రోజు సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, సంతానం కావలసినవారికి గరుడ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం దేవతాహ్వానం, శేషవాహన సేవలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు చినజీయర్‌ స్వామి మంగళశాసనాలు అందించారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు అనంతస్వామి, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న చినజీయర్‌ స్వామి

2029 నాటికి... బీబీనగర్‌కి డబ్లింగ్‌ పూర్తి

- ఈ ఏడాది 30 కిలోమీటర్ల పనిని పూర్తి చేస్తాం
- మరో 20 రోజుల్లో అందుబాటులోకి డొంకరోడ్డు మూడొంతెనల మార్గం
- గుంటూరు పశ్చిమ, తూర్పు టర్మినల్స్‌ని కలుపుతూ ఎఫ్‌వోబీ
- పాత్రికేయుల సమావేశంలో డీఆర్‌ఎం రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్‌ రైల్వే డబ్లింగ్‌(రెండో మార్గం) 2029 నాటికి పూర్తి చేస్తామని డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ ఎం రామకృష్ణ చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం సెక్షన్ల వారీగా గడువు సమయాన్ని నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే కుక్కడం - విష్ణుపురం మధ్యన 30 కిలోమీటర్ల సెక్షన్‌లో ప్రిలిమినరీ వర్క్సులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ సెక్షన్‌ని ఏడాదిలోపే పూర్తి చేసి కమిషనింగ్‌ చేస్తామన్నారు. అలానే 2026-27లో 96 కిలోమీటర్లు, 2027,-28లో 90 కిలోమీటర్లు, 2028-29లో 58.5 కిలోమీటర్ల డబ్లింగ్‌ని పూర్తిచేసి మొత్తం ప్రాజెక్టుని సంపూర్ణం చేస్తామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులపై సోమవారం తొలుత వీడియో కాన్ఫరెన్స్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌, ఆ తర్వాత దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌ మాట్లాడారు. అనంతరం గుంటూరు డివిజన్‌ ప్రాజెక్టులు, పనులపై డీఆర్‌ఎం రామకృష్ణ ఏడీఆర్‌ఎం కే సైమన్‌, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశంలో వివరించారు.

● అమరావతి రాజధాని రైలుమార్గం(ఎర్రుపాలెం - నంబూరు)కు సంబంధించి రూ. 2047 కోట్ల అంచనా విలువతో గత ఏడాది మంజూరు చేయడం జరిగింది. దీనికి సంబంధించి 100 శాతం భూసేకరణ ఖర్చుని రైల్వే శాఖ భరిస్తున్నది. ఐదు నెలల్లో మట్టి పనులు ప్రారంభించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టబోతున్నది. తొలుత నంబూరు - అమరావతి సెక్షన్‌ పనులు ప్రారంభమవు తాయని కన్‌స్ట్రక్షన్‌ డిపార్టుమెంట్‌ ద్వారా తెలిసిందని డీఆర్‌ఎం పేర్కొన్నారు.

● గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్‌లో క్లిష్టమైన దిగువమెట్ట - చలమ సెక్షన్‌లో అటవీ శాఖ, వన్యప్రాణి విభాగాల నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. తొలుత చిన్న టన్నెల్‌ పనులు ఈ నెల మొదటి వారాంతంలో ప్రారంభిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ సెక్షన్‌ పనులు పూర్తి చేసి గుంటూరు నుంచి నంద్యాల వరకు డబుల్‌ లేన్‌ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆ తర్వాత రైళ్ల ప్రయాణ సమయాన్ని అరగంట వరకు తగ్గించే చర్యలు తీసుకొంటామని చెప్పారు.

● నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గానికి సంబంధించి పొదిలి వద్ద కొంత భూసేక రణ సమస్య ఉన్నది. ప్రస్తుతానికి న్యూ పిడుగురాళ్ల నుంచి మల్లవరం వరకు పనులు పూర్తి అ య్యాయి. మల్లవరం - కనిగిరి మధ్యన 53 కిలోమీ టర్ల సెక్షన్‌ని నిర్మించాలి. ఇందుకోసం సీఎం చంద్రబాబు స్పెషల్‌ టాస్కుఫోర్సుని కూడా నియమించారు. సాధ్యమై నంత త్వరగా భూసేకరణ సమస్య అడ్డంకిని తొలగించి కనిగిరి వరకు పనులు పూర్తి చేస్తాం. అప్పుడు కనిగిరి నుంచి ఈ సెక్షన్‌లో ప్యాసింజర్‌ రైళ్లను ప్రవేశపెట్టడానికి చర్యలు చేపడతామన్నారు.

● గుంటూరు నగరంలోని డొంకరోడ్డు మూడొంతెనల వద్ద ఆర్‌యూబీ ఎక్స్‌టెన్షన్‌ పనులు కొంత ఆలస్యమైన విషయం వాస్తవమే. ఊహించని విధంగా కార్పొరేషన్‌ పైపులైను షిఫ్టింగ్‌ వర్క్సు రావడం వలన జాప్యం జరిగింది. ఈ నెల 25వ తేదీ నాటికి ఎట్టి పరిస్థి తుల్లో పనులు పూర్తి చేసి ఈ మార్గాన్ని రోడ్డు ట్రాఫిక్‌కి అందుబా టులోకి తీసుకొస్తాం. మొత్తం 58 ఆర్‌సీసీ బ్లాకులకుగాను 16 బ్లాకులు అమర్చాం. నగరంలో ట్రాఫిక్‌ సమస్య దృష్ట్యా వీటిని రా త్రి వేళ నల్లపాడు నుంచి ఇక్కడికి రవాణ చేయాల్సి వస్తున్నది. ఇదే సమయంలో మూడొంతెనల వద్ద ఆర్‌సీసీ బ్లాకులను నిల్వ చేసే స్థలం కూడా అందుబాటులో లేదు. దీని దృష్ట్యా రోజుకు నా లుగు బ్లాకులు తీసుకొచ్చి అమర్చుతున్నాం. ఆదివారం నల్లపాడు రోడ్డులో మిర్చి లారీల వలన తీవ్ర ఆటంకం కలిగింది. ఈ విష యాలను నగర ప్రజలు అర్థం చేసుకొంటారని ఆశిస్తున్నామన్నారు.

● గుంటూరు రైల్వేస్టేషన్‌ తూర్పు వైపున అన్ని హంగులతో ప్రయాణీకులకు సదుపాయాలు, స్టేషన్‌ భవనం ఆధునికీకరణ చేస్తున్నాం. మరో నాలుగు నెలల్లో ఈ పనులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది. ఇదే సమయంలో గుంటూరు పశ్చిమ వైపున సర్క్యులేటింగ్‌ ఏరియా నుంచి తూర్పు వైపున సర్క్యులేటింగ్‌ ఏరియా వరకు ఒక ఫుట్‌ వోవర్‌ బ్రిడ్జీని నిర్మిస్తున్నాం. ఇది కొంత జాప్యం కావొచ్చన్నారు. గుంటూరు యార్డు రీమోడలింగ్‌ మరో ఏడాదిలో పూర్తి అయ్యే అవకాశం ఉన్నది. అందులో భాగంగానే ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నాం.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

నాదెండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిపై పార్ కార్నర్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పెనుగొండ్ల గణేష్ (22) అనే యువకుడు తెల్లవారుజామున మృతిచెందాడు. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన వెంకటరావు మూడో కుమారుడైన గణేష్ పేపర్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 5గంటల సమయంలో చిలకలూరిపేట నుంచి లింగంగుంట్ల వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో షెడ్ దగ్ధం: రూ.6లక్షల ఆస్తి నష్టం

యడ్లపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నర్సరీకి చెందిన షెడ్‌లో మంటలు వ్యాపించి షెడ్‌లోని విలువైన సామాన్లు దగ్ధమయ్యాయి. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన పాములపాటి చంద్రమౌళి గత ఏడాది వంకాయలపాడు గ్రామ పరిధిలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు పక్కగా నర్సరీని ఏర్పాటుచేసి మిర్చి నారుమళ్ళు సాగుచేశాడు. నారు విక్రయాల సీజన్ పూర్తికావడంతో తడులు అందించేందుకు వినియోగించే నాలుగు విద్యుత్ మోటార్లు, స్ప్రింక్లర్లు, పైపులు, షేడ్ నెట్ దొంతరలను గత ఏడాది డిసెంబరులో నర్సరీకి సమీపంలో ఏర్పాటుచేసిన రేకుల షెడ్‌లో ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున షెడ్ నుంచి మంటలు వస్తుండడంతో అటుగా వెళుతున్న వారు చూసి యజమానికి ఫోన్‌చేసి తెలిపారు. దీంతో చంద్రమౌళి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది నర్సరీవద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే షెడ్‌లోని మోటార్లు, పైపులు, స్ప్రింక్లర్లు, షేడ్‌నెట్ రీల్స్ అగ్నికి దగ్ధయ్యాయి. దగ్ధమైన వస్తువుల విలువ సుమారు రూ.6లక్షలు ఉంటుందని బాధితుడు చంద్రమౌళి తెలిపారు.

స్త్రీనిధి రికవరీపై ప్రత్యేక బృందాలు

ఈపూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం స్త్రీనిధి రికవరీ కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక బృందాల సమావేశం జరిగింది సమావేశంలో పాల్గొన్న ఏజీఎం ధర్మేంద్ర మండలంలో మొండి బకాయిలపై ఆరాతీశారు. ఎస్‌పీఏ రూ.75లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి మొండి బకాయిలు వసూలు చేయాలన్నారు. బకాయిలు ఉన్న గ్రామ సంఘాలను కలిసి వారు చెల్లించేలా చూడాలన్నారు. ఊడిజర్ల, అంగలూరులోని గ్రామ సంఘాలను పరిశీలించారు. సమావేశంలో ఏపీఎం రంగారెడ్డి, సీసీలు, పాల్గొన్నారు.

7న వేల గొంతుకలు లక్ష డప్పుల మహా ప్రదర్శన

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న వేల గొంతుకలు - లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంత చేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు మాదిగ అన్నారు. సోమవారం పట్టణంలోని కంభంపాలెంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరుగురి నాగరాజు మాదిగ మాట్లాడుతూ ప్రతి మాదిగ బిడ్డ వర్గీకరణను సమర్థిస్తున్న ప్రతి ఒక్కరూ చంకన డప్పు వేసుకొని మహాప్రదర్శనకు వేలాదిగా తరలిరావాలని అన్నారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు బూదాల విజయ్ మాదిగ, నిదానపు ఆనంద్ మాదిగ, పాతర్ల చిన్నిమాదిగ, నవీన్ మాదిగ, నాగూర్ మాదిగ, లాజర్ మాదిగ, ఏసుబాబు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: తహసీల్దార్

శావల్యాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్నందున మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ప్రజలంతా ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని మండల తహసీల్దార్ కె.సుజాత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో మొత్తం 658 ఓటర్లు ఉన్నారని, వారిలో 455మంది పురుషులు, 203మంది స్త్రీలు ఉన్నారని తెలిపారు. శావల్యాపురం జడ్పీపాఠశాలలోని 8వ తరగతి గదిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఆధ్వర్యంలో ఎంసీసీని ఏర్పాటు చేశామని, గ్రామాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా ఎన్నికల నియమావళిని అమలు చేయాలన్నారు.

రాష్ట్రానికి వరదలా నిధులు

● రైల్వే బోర్డు మెంబర్ సత్యనారాయణ

వినుకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ఏపీకి భారీనిధులు కేటాయించడం అభినందనీయమని బీజేపీ సీనియర్ నాయకుడు (జీఆర్‌యూసీసీ) రైల్వే బోర్డు మెంబర్ గోరంట్ల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936కోట్లు, ప్రాజెక్టు నిర్మాణానికి బ్యాలెన్స్ గ్రాంట్‌గా రూ.12,157కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.3,295కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730కోట్లు, ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162కోట్లు, జీరోబడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186కోట్లు, లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆపరేషన్‌కు రూ.375 కోట్లు, రాష్ట్రంలో రోడ్లు, వంతెన నిర్మాణాలకు రూ.240కోట్లు, ఏపీ ఇరిగేషన్ లైవ్లీ హుడ్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు రెండో దశకు రూ.242.50 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు.

మిరప రైతు కుదేలు

❍ తెగుళ్ళతో తగ్గిన దిగుబడి
❍ మార్కెట్‌లో ధరాఘాతం
❍ నష్టాలతో మిరప రైతుల దిగాలు


తాలు కాయలు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్టించిన మిరప రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. తెగుళ్ళు, చీడపీడలకు తోడు మార్కెట్‌లో ధరల పతనం మిరప రైతులను కుంగదీశాయి. అప్పులకు వెనుకాడకుండా మిరప సాగుచేసి నష్టాలు మూటగట్టుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వర్షాధారంగా బోరు బావుల కింద మండలంలో 15వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. ప్రధానంగా తేజ, బ్యాడిగి తదితర రకాలను రైతులు సాగుచేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి మిర్చి సాగు చేపట్టారు. మొక్కలు నాటినప్పటి నుంచి ఎరువులు, మందులు పిచికారిచేస్తూ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయినప్పటికీ వాతావరణం మార్పులతో దోమ, బ్లాక్ టిప్పసం, ఎర్ర నల్లి


పేరూరుపాడులో తెగుళ్ళబారిన పడిన మిరప తోట

పంటపై తీవ్ర ప్రభావం చూపింది. కాయ దశలో తుఫాన్‌ల ప్రభావంతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలుశాతం పెరిగింది. పంట కోతకు సమానంగా కల్లాల్లో కాయలు గ్రేడింగ్ ఖర్చవుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది తేజా రకాల్లో పది నుంచి 15 క్వింటాళ్ళు, బ్యాడిగి రకాల్లో మంచి కాయలు దిగుబడి ఐదు నుంచి పది క్వింటాళ్ళకు మించదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు అధికమవ్వటంతో ఎకరం సాగుకు రూ.1.50 లక్షలకు పైగా వ్యయం అవుతుంది. మిరప పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తే లాభాలొస్తాయి. ఐతే రెండు సంవత్సరాల నుంచి ధరలు రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. గత ఏడాది పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు అమాంతం పతనం కావటంతో చాలామంది రైతులు మిర్చిని ఏసీ గోడౌన్‌లలో నిల్వ చేసుకున్నారు. మంచి ధర వస్తే విక్రయించాలని రైతులు ఎదురుచూసి చివరికి రైతులు భారీ నష్టాలను చవిచూశారు. రైతుల ఆశలపై నీళ్ళు చల్లేలా క్రమేణా ధరలు మరింత దిగజారాయి. రెండు సంవత్సరాల క్రితం వరకు తేజా రకాలు క్వింటాకు రూ.22వేల నుంచి రూ.26వేలు ధర పలికేది. ఐతే ప్రస్తుతం సగం ధర కూడా రావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధరలకు మిర్చిని పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని మిరప రైతులు పేర్కొన్నారు. ఇలా ఐతే అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదంటున్నారు. మిరపకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి). ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలు, రీ ఓపెన్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రీ ఓపెనింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక రద్దు చేయడం వలన నూతన అర్జీలు స్వీకరించడం లేదని, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో 40 రీ ఓపెనింగ్ అర్జీలను కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించారు. అర్జీదారులకు వ్యక్తిగతంగా ఫోన్‌చేసి అధికారులు వ్యవహరించిన తీరు, సంతృప్తికరమైన పరిష్కారాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమావేశలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, రీ ఓపెన్ అయిన శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ

10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సోమవారం తెలిపారు. ఈ మేరకు సోమవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థలకు ఈ మాత్ర లను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల ద్వారా ఈ నులిపురుగులను నివారించవచ్చు అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో, కళాశాలలో అంగన్వాడీ కేంద్రాలలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల ప్రతి ఒక్కరికి ఈ నులిపురుగుల నివారణ మాత్రలను అందజేయాలన్నారు. భోజనం అనంతరం మాత్రమే ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలలోపు బాలబాలికలకు సగం మాత్రమే వేయాలన్నారు. ఈ మాత్ర వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా, వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి స్వర్ణ రాజరాజేశ్వరి, సిబ్బంది, లయన్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.75 మీటర్లు అంటే సుమారుగా 150అడుగులు ఉండాలని 2007-2008లో వైస్ రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించడం జరిగిందన్నారు. పోలవరం డ్యాం 150 అడుగులు ఎత్తు ఉంటే 194 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కానీ కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో పోలవరం ఎత్తు 41.75 మీటర్లకు తగ్గించడం జరిగిందన్నారు (135అడుగులు). దీంతో పోలవరం ప్రాజెక్ట్‌ను ఈ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు. 18మంది ఎంపీలు ఉన్న మీరు ఈ రాష్ట్రానికి ఏమి సాధించారని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

పట్ట పగలు నూజెండ్లలో చోరీ

నూజెండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలే మండల కేంద్రం నూజెండ్లలో చోరీ జరిగిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. బాధితుల కథనం ప్రకారం గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన చామర్తి ఏడుకొండలు పనుల నిమిత్తం బయటకు వెళ్ళిన సందర్భంలో దొంగలు ఇంటికి వేసిన తాళంను, బీరువాను పగలగొట్టి చోరీ చేశారు. బీరువాలో దాచిన నాలుగు సవర్ల బంగారం, వెండి పట్టీలు, నగదు కలిపి సుమారు రూ.5 లక్షలు సొత్తు చోరీకి గురినట్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు. సంఘటనా స్థలాన్ని ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లకమ్మ నదిలో మహిళ గల్లంతు

నూజెండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిజినేపల్లి మరియమ్మ గుండ్లకమ్మ నదిలో గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మరియమ్మ గుండ్లకమ్మ నది పక్కన మరికొంతమందితో కలసి పశువులు మేపుకుంటుండగా మరియమ్మ గేదె నీటిని దాటి అవతలి ఒడ్డుకు వెళ్ళటంతో తోలుకు వచ్చేందుకు వెళ్ళింది. గుండ్లకమ్మ నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో గల్లంతైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నదిలో రాత్రి వరకు మరియమ్మ కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రాత్రి సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకాయమ్మకు ఘన నివాళి

నూజెండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ లగడపాటి వెంకటరావు భార్య లగడపాటి వెంకాయమ్మ 8వ వర్ధంతిని సోమవారం నూజెండ్ల సమీపంలోని స్మృతి వనంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీ నాయకులు వి.పేరయ్య, జి.అంజనేయులు, కె.వీరాంజనేయులు, నక్కా బుల్లీశ్వరరెడ్డి, జి.అంజనేయులు, కె.కోటిరెడ్డి, పోట్ల రాధాకృష్ణమూర్తి తదితరులు వెంకాయమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కమలారాంను సత్కరిస్తున్న మాజీ మంత్రి బుద్ధ ప్రసాద్

రచయిత కమలారాంకు సత్కారం

వినుకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలుగు, వెలుగు సాహితీ వేదిక జాతీయ సంస్థ విజయవాడ వారి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో వినుకొండ పట్టణానికి చెందిన రచయిత కమలారాంను ఘనంగా సత్కరించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్ జ్ఞాపికను అందజేసి సత్కరించినట్లు ఆయన తెలిపారు.


నరసరావుపేట పట్టణంలో వాహనాలు తనిఖీచేస్తున్న రవాణా శాఖ అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● ఎంవీఐ ఎస్ శ్రావ్య

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రావ్య తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులో సోమవారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రావ్య వాహనాల తనిఖీలు చేపట్టారు. పట్టణంలో పలు కళాశాలలు, ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులు, ఆటోలను తనిఖీచేశారు.ఈ తనిఖీలలో పట్టణంలోని నాలుగు కళాశాలకు చెందిన 20బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రావ్య, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మనీషా, వంశీకృష్ణ, ఎం.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్ పదవి తోట సత్యంకు ఇవ్వాలి

● ఎమ్మెల్యే పుల్లారావుకు కాపు నాయకుల వినతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని పట్టణంలోని పురుషోత్తమపట్నంకు చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకులు తోట సత్యంకు ఇవ్వాలని సోమవారం రాష్ట్ర కాపునాడు సేవా సమితికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాస గృహంలో కలిసి కోరారు. ఈ మేరకు కాపునాడు సేవా సమితి వారు చేసిన ఏకగ్రీవ తీర్మానం ప్రతిని ప్రత్తిపాటికి వారు అందించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ, పార్టీ కోసం అహర్నిశలు తోట సత్యం శ్రమించారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని ప్రతిపాటి వారికి తెలిపారు.

టీఎంఐ-2 సంస్థతో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాదు టీఎంఐ-2 సంస్థతో ఒప్పంద కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఒప్పంద పత్రాన్ని హైదరాబాద్ టీఎంఐ-2 సంస్థ సీనియర్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, కళాశాల చైర్మన్ షేక్ మీరావలికి అందించారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ షేక్ ముజీర్ మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సి సాంకేతిక నైపుణ్యాల శిక్షణ జావా, పైథాన్, అజుర్, పవర్‌బీ, జెనరేటివ్ ఏఐ తదితర వాటి మీద శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. పలు ఎంఎన్‌సీ కంపెనీలలో ఉపాధి కూడా కల్పిస్తారన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా మాట్లాడుతూ ఇటువంటి ఒప్పందాల వలన గ్రామీణ విద్యార్థులకు ఉచిత శిక్షణతో ఎక్కువ ఉద్యోగాల అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సోమవారం బెంగుళూరు యాక్సిస్ బ్యాంకు అధికారులు జాబ్ ఫెయిర్ నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న 26మంది విద్యార్థులను అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణ పూర్తయిన తరువాత ఏడాదికి రూ.4.42లక్షలు వేతనంగా అందజేస్తారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ అన్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే విధులలో చేరాల్సి ఉంటుందన్నారు. వందశాతం ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో కళాశాల యాజమాన్యం పనిచేస్తుందని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇన్నేపల్లి క్రిష్ణకిషోర్ అభినందించారు.

అక్రమ కుళాయి కనెక్షన్లు ఉంటే క్రిమినల్ కేసులు

● మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకునే గృహ యజమానులపై, వాటిని వేసే అనధికార ప్లంబర్లపై క్రిమినల్ కేసులు పెడతామని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సోమవారం హెచ్చరించారు. ఇప్పటికే అక్రమ కుళాయి కనెక్షన్ ఉన్నవారు మున్సిపాలిటీని సంప్రదించి వారి కనెక్షన్లను నిబంధనల ప్రకారం డిపాజిట్లు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. కొందరు మునిసిపాలిటీకి డిపాజిట్లు చెల్లించకపోవడమే కాక, సిమెంట్ రోడ్లు పగలగొట్టి అక్రమంగా కుళాయిలు వేసుకోవడం సహించరాని విషయమన్నారు. అక్రమ కుళాయి కనెక్షన్లు వేసుకుంటున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు తన వాట్సాప్ నంబర్ 9849907278కు ప్రజలు తెలిపి సహకరించాలని ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కూడా ఆయన తెలిపారు.



శృంగేరి శంకర మఠంలో శారదాదేవి అమ్మవారికి లేఖిని అలంకారం, సామూహిక అక్షరాభ్యాసాలలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

నరసరావుపేటలో సామూహిక అక్షరాభ్యాసాలు

● శృంగేరి శంకర మఠంలో ఘనంగా హోమాలు

నరసరావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరస్వతిదేవి జన్మదినం సందర్భంగా మాఘశుద్ధ పంచమిని పురస్కరించుకొని నరసరావుపేటలోని శృంగేరి శంకర మఠంలోని శారదాదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి లేఖిని (కలాలతో) అలంకారం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. మేధా దక్షిణామూర్తి.. సరస్వతీ హోమాలు ఘనంగా జరిగాయి. 170 మందికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాల్ అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.


విజేతలకు జ్ఞాపికను అందిస్తున్న కస్టమ్స్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి

కోలాహలంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

నాదెండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వరస్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజసం బండ లాగుడు పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు తరలివచ్చి ఈ పోటీలను తిలకిస్తున్నారు. రెండు పళ్ళ విభాగంలో జరిగిన పోటీల్లో ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన జవ్వాజి మేఘనాథ నాయుడుకు చెందిన ఎడ్ల జత 3,076.9 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ ఎడ్ల జత 2629.11 అడుగులు దూరం లాగి ద్వితీయ బహుమతిని, నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగమల్లేశ్వరరావు ఎడ్ల జత 2,508.6 అడుగులు లాగి తృతీయ స్థానాన్ని సాధించాయి. అదేవిధంగా పూసపాడుకు చెందిన యడ్లజత నాలుగు, నాగరాజుపల్లికి చెందిన ఎడ్లజత ఐదు, దేవరపల్లికి చెందిన ఎడ్లజత ఆరో స్థానాన్ని సాధించాయి. కాగా సాయంత్రం సోమవారం రాత్రి నాలుగు పళ్ళ విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి విజేతలకు జ్ఞాపికలను, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. 6వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి.

సాయి సాధన చిట్స్‌పై మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): 20 సంవత్సరాలుగా పల్నాడు జిల్లాలో చిట్స్ నిర్వహిస్తున్న సాయి సాధన చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసానికి పాల్పడుతోందని తగుచర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు వేలూరు సుబ్బారెడ్డి మొదటి పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదుచేశారు. తాను తన కుటుంబ సభ్యులు సుమారు రెండు కోట్ల 20 లక్షల మేరకు చీటీలు వేశామని, మరో 60 లక్షలు డిపాజిట్ చేశామన్నారు. చీటీ పాడుకున్నా నగదు ఇవ్వలేదని, సరైన సమాధానం చెప్పటం లేదన్నారు. ఇటీవల కంపెనీ నిర్వాకుడు పుల్లారావు ఆచూకీలేదని తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎంవీ చరణ్ తెలిపారు.

వరవకట్టలో పారిశుధ్య కార్యక్రమాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరవకట్టలో సోమవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని వీధులు శుభ్రం చేశారు. మురుగుకాలువలో పూడిక తీశారు. కార్యక్రమంలో మాతంగా బంగారం, అంకమ్మ చౌదరి, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా పరికరాల వితరణ


దాతలు అందించిన ఆట వస్తువులు

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు పెద్దబడి దగ్గర ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికరాలను అందించినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు సోమవారం తెలిపారు. కుందిర్తి ఆదియ్య మాస్టారు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు రూ.10వేలు విలువజేసే రెండు ఇనుప ఊయలలు, బరువుల పోటీలకు వినియోగించే రెండు యంత్ర పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీలు, గేటు రిపేర్, ఫ్లెక్సీలు, ఆట వస్తువులకు గ్రామానికి చెందిన గోనుగుంట్ల ప్రసాద్, గుత్తి అంజనాదేవి, ఓబూరి సుబ్బారావు, కోండ్రు నాగమల్లేశ్వరిలు రూ.11,500 విరాళంగా సమర్పించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో అభివృద్ధి పనులకు సిబ్బంది వెల్లలచెరువు రాధ, సుజాత, గ్రామస్థులు కుందిర్తి హనుమాయమ్మ, అజయ్‌కుమార్, అభిషేక్‌లు సహకారం అందించారని తెలిపారు.

కోలాహలంగా కరాటే పరీక్షలు

వినుకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో కరాటే మాస్టారు ఖాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు సోమవారం కోలాహలంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలకు చెందిన 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు ఎల్లో, గ్రీన్, ఆరంజ్, బ్రౌన్ బెల్టు టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టును రాష్ట్ర కరాటే అసోసియేషన్ సెక్రటరీ ప్రభాకర్ పర్యవేక్షించి విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సునీత కరాటే టెస్టులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.